

### గల్లీ కుర్రాళ్లూ ఒలింపిక్స్‌లో
## అదరగొట్టాల్సిందే

- ఒలింపిక్సే లక్ష్యంగా రేవంత్ మాస్టర్ ప్లాన్
- కొరియా వర్సిటీతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ చరిత్రాత్మక ఒప్పందం
- భారత్ గర్వించే అథ్లెట్లను తయారు చేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

2


# ప్రభంజనం
తెలుగు దినపత్రిక

సంపుటి: 01 సంచిక: 11
పేజీలు: 10 వెల: 5

Follow:
prabanjanam

27.08.2026 గురువారం, హైదరాబాద్

WWW.PRABANJANAM.COM




పార్టీ నేత కోరిక.. వధువు మెడలో తాళి కట్టిన కవిత

- సోదరి లేని లోటును తీర్చిన టీఆర్ఎస్ పార్టీ చీఫ్

2



ట్రో, వెయిట్.. రాహుల్‌పై కంగనా సెటైర్లు

- నటి కృతి సనన్ ప్రతిపక్ష నేత రాహుల్ మద్దతు

8



తప్పుడు కథనాలు రాస్తే సహించేది లేదు..!

- మాగూర్ల మీరేమి సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు

2

ఒకవైపు భారీ సంక్షేమ పథకాలు.. మరోవైపు పెరుగుతున్న రుణభారం.. ఇంకోవైపు కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూముల వేలం. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా చెప్పుకునే తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై మరోసారి చర్చ మొదలైంది. హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన ప్రభుత్వ భూములను వేలం వేయడం ద్వారా ఖజానాకు తక్షణ ఆదాయం సమకూరుతున్నా.. ఇది దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహంలో భాగమా? లేక పెరుగుతున్న వ్యయ అవసరాలకు తాత్కాలిక పరిష్కారమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# భూములు అమ్మి.. అప్పులు చేసి.. సంక్షేమం?




## భూముల అమ్మకాలతో ఖజానాకు తాత్కాలిక ఊరట..

**సంక్షేమ పథకాలపై భారీ కేటాయింపులు**
**అప్పులు పెరుగుతున్న వేళ**
**దీర్ఘకాలిక ఆదాయ వనరులపై ప్రశ్నలు**
**ప్రభుత్వ ప్లానింగ్ లోపమా?.. ఎన్నికల హామీల ఆర్థిక భారం అంచనా వేయలేదా?'**

### అభివృద్ధి - సంక్షేమం.. సమతుల్యత ఎక్కడ?

*రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యాన్ని కేవలం సంక్షేమంతోనో, కేవలం అప్పులతోనో నిర్ణయించలేం. మూలధన వ్యయం ఎంత పెరుగుతోంది? ఉద్యోగాలు సృష్టించే పెట్టుబడులు ఎంత వస్తున్నాయి? పన్ను ఆదాయానికి కొత్త వనరులు ఎన్ని ఏర్పడుతున్నాయి? అప్పులతో నిర్మిస్తున్న ఆస్తులు భవిష్యత్‌లో ఆదాయం తీసుకురాగలవా? అన్న ప్రశ్నలకు సమాధానాలు అవసరం. తెలంగాణకు హైదరాబాద్ రూపంలో బలమైన ఆర్థిక వనరు ఉంది. ఐటీ, ఫార్మా, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, సేవారంగం రాష్ట్రానికి విస్తృత ఆదాయ అవకాశాలను అందిస్తున్నాయి. వీటిని మరింత విస్తరించి స్థిరమైన పన్ను ఆదాయం, ఉపాధి, పెట్టుబడులుగా మార్చడమే దీర్ఘకాలిక పరిష్కారం.*

**తెలంగాణ బ్యూరో: ( ప్రభంజనం )**

202627 బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ రుణ బకాయిలు రూ.5,62,363 కోట్లకు చేరనున్నాయి. మరోవైపు రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలకు వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు. సంక్షేమం కొనసాగించడంతో పాటు మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనకు అవసరమైన మూలధన పెట్టుబడులు పెంచాల్సిన పరిస్థితి ఉంది. అప్పులు తీసుకోవడం లేదా ప్రభుత్వ భూములు విక్రయించడం తప్పనిసరిగా ఆర్థిక వైఫల్యానికి సంకేతం కాదు. ఆ నిధులను ఉత్పాదక ఆస్తుల సృష్టికి వినియోగిస్తే భవిష్యత్‌లో ఆదాయం, ఉపాధి పెరిగే అవకాశం ఉంటుంది. కానీ రోజువారీ వ్యయాలు, నిరంతర సంక్షేమ బాధ్యతలకు ఆస్తుల విక్రయాలు, కొత్త రుణాలు ప్రధాన ఆధారంగా మారితే మాత్రం దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వంపై ప్రశ్నలు తలెత్తుతాయి అనడంలో సందేహం లేదు.

**రూ.5.62 లక్షల కోట్ల రుణభారం**

202627 బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వ రుణ బకాయిలను రూ.5,62,363 కోట్లుగా అంచనా వేశారు. ఇది రాష్ట్ర జీఎస్‌డీపీలో సుమారు 29 శాతానికి సమానం. 202324లో రూ.3,98,655 కోట్లుగా ఉన్న రుణ బకాయిలు 202425లో రూ.4,47,493 కోట్లకు, 202526 సవరించిన అంచనాల్లో రూ.5,03,905 కోట్లకు చేరాయి. అంటే మూడేళ్ల వ్యవధిలో రుణభారం గణనీయంగా పెరిగింది. అయితే ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని కేవలం ఋణాలతోనే అంచనా వేయడం సరిపోదు.

• మిగతా 2లో..



## పేదవాడి ఇంటికి మేము భరోసా..

- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా వెనక్కి తగ్గం
- ఇందిరమ్మ ఇండ్ల కోసం కేంద్రం సహాయం అందిస్తుందన్న ఆశతో ఎదురు చూశాం..
- ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు
- మార్చి 31 వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్నా పేదల కోసం రూ.185 కోట్లు విడుదల చేశాం
- 15, 475 మంది లబ్ధిదారుల ఖాతాల్లో చివరి బిల్లులు జమ చేసాం.. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2




## నా బిడ్డ వ్యాఖ్యలతో నాకేం సంబంధం?

- సుస్మిత ప్లాన్-బి ఏంటో నాకు తెలియదు
- కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతాం.. కొండా మురళి సంచలన వ్యాఖ్యలు
- పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారంలో నిజం లేదు.. కొండా మురళి క్లారిటీ
- సోనియా, రాహుల్, ప్రియాంకలపై తమకు పూర్తి విశ్వాసం ఉంద వెల్లడి

3



## తెలంగాణలో మరో జెన్‌జీ ఉద్యమం తప్పదు

### పేదల భూములు లాక్కుంటే ఊరుకోం.. ఖబడ్దార్ బిడ్డా: మాజీ మంత్రి హరీష్

- సెక్షన్ 22ఏ ఎత్తేయకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తాం
- రేవంత్ ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు అల్టిమేటం
- పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా?
- రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు.. ప్రాణాలు, ఆస్తులకు రక్షణ లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు హాట్ కామెంట్స్
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం

3

## భూ భారతి అతిపెద్ద కుంభకోణం

- మంత్రి పొంగులేటి రాజీనామా చేయాల్సిందే
- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్
- నిషేధిత జాబితా భూముల అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



**హైదరాబాద్, (ప్రభంజనం):**

నిషేధిత భూముల అంశంపై ఎందుకు స్పందించడం లేదంటూ రాహుల్ గాంధీకి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. 22ఏ నిషేధిత జాబితాపై కుట్ర చేసిందెవరో తేల్చాలి. 22ఏ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న భూదందాపై నెలరోజులుగా బీజేపీ పోరాటం చేస్తుంది.

• మిగతా 3లో..

# నేపాల్‌లో వరదల విలయం

## ఉప్పొంగిన భోటే కోశి నది

- టిబెట్ నుంచి దూసుకొచ్చిన ఆకస్మిక వరదలు
- కొట్టుకుపోయిన అనేక గ్రామాలు
- 19 మంది మృత్యువాత.. 384 మంది గల్లంతు..
- 105 మంది భారతీయ పర్యాటకుల మిస్సింగ్!



**ఖాట్మండ్: ( ప్రభంజనం )**

టిబెట్ సరిహద్దులకు సమీపంలో ఉండే నేపాల్ ఉత్తర భాగంలో ఫ్లాష్ ఫ్లడ్స్ పెనువిషాదం సృష్టించాయి. భోటేకోశి నది అకస్మాత్తుగా ఉప్పొంగడంతో బుధవారం ఉదయం టిబెట్ వైపు నుంచి ఒక్కసారిగా ఆకస్మిక వరదలు నేపాల్‌లోని నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లోకి ప్రవేశించాయి. దీంతో నది పరీవాహక ప్రాంతంలోని అనేక గ్రామాలను మెరుపు వరదలు తుడిచిపెట్టాయి. ఈ ప్రకృతి విలయంలో 19 మంది మరణించినట్లు నేపాల్ అధికారిక వర్గాలు ప్రాథమికంగా ధృవీకరించాయి. అనేక గ్రామాలు నీట మునిగిపోవడంతో భారీ స్థాయిలో

• మిగతా 2లో..



2

## కోదాడ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

- కంటెనర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు..
- ఆరుగురు మృతి, 20 మందికి గాయాలు
- క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు
- కోదాడ మండలం ద్వారకుంట దగ్గర ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

## పార్టీ నేత కోరిక..

- వధువు మెడలో తాళి కట్టిన కవిత
- సోదరి లేని లోటును తీర్చిన టీఆర్ఎస్ పార్టీ చీఫ్
- ఇంటి ఆడబిడ్డగా మారి పార్టీ నాయకుడి పెళ్లి జరిపించిన కవిత
- ఆడపడుచుగా అన్నీ తానై వ్యవహరించిన కవిత

**హైదరాబాద్, (ప్రభంజనం):**

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత.. ముదిరాజ్ ఇంటి ఆడబిడ్డగా మారి కీసర క్రాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన తన పార్టీ నాయకుడి వివాహాన్ని తన చేతుల మీదుగా జరిపించింది. యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామానికి చెందిన బాషబోయిన బాలప్రసాద్ తెలంగాణ రక్షణ సేన నాయకుడు. బాలప్రసాద్కు సీతాఫల్ మండికి చెందిన శివాణితో వివాహం నిశ్చయం అయింది. కాగా బాలప్రసాద్‌కు సోదరిలు లేకపోవడంతో అతని కోరిక మేరకు కవితనే ఇంటి ఆడబిడ్డగా మారింది. వధువుకు వరుడు తాళి కట్టే ముందు ఆడపడుచుతో వధువు మెడలో పసుపు కొమ్ముతో మూడు ముళ్లు వేయిస్తారు. వారి సంప్రదాయం ప్రకారం కవిత గౌరీ పూజలో పాల్గొని వధువు శివాణి మెడలో పసుపుకొమ్ముతో మూడు ముళ్లు వేశారు. ఉంగరపు వేలుకు ప్రదానపు ఉంగరం తొడిగారు. ఒడిబియ్యం పోసి, పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు. అనంతరం బాలప్రసాద్ శివాణి మెడలో మంగళసూత్ర ధారణ చేశారు. అనంతరం నూతన వధూవరుల్ని కవిత ఆశీర్వదించారు.



## ఖబడ్దార్..తప్పుడు కథనాలు రాస్తే సహించేది లేదు..!

- మాగూర్చి మీరేమి సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు
- ఇష్టం ఉన్నట్టు రాస్తామంటే కుదరదు
- ఓ మీడియా సంస్థపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్: ( ప్రభంజనం )**

తమలాంటి నిజాయితీగల రాజకీయ నాయకులను కించపరిచేలా తప్పుడు కథనాలు ప్రచురిస్తే ఇకపై సహించబోమని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలోని ఓ మీడియా సంస్థపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్లమెంట్‌లో రాష్ట్రం కోసం పోరాడిన అసలైన కాంగ్రెస్ నాయకులమని పేర్కొన్నారు. తమలాంటి నాయకులను బలహీనపరిచే ఉద్దేశంతో కొందరికి మద్దతుగా కథనాలు రాస్తున్నారని ఆరోపించారు. తమపై తప్పుడు కథనాలు రాస్తే ఇకపై ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్నామని, ఇక తెలంగాణకు చెందిన వారు ఆంధ్రా మీడియాపై ఆధారపడి పనిచేయాల్సిన అవసరం లేదని అన్నారు. వంద ఛానళ్లు, పత్రికలు పెట్టే సామర్థ్యం తమకు ఉందని వ్యాఖ్యానించారు. తాము అనుకుంటే తెలంగాణలో ఏ ఛానల్, ఏ పత్రికా ఉండదంటూ ఆయన హెచ్చరికలు చేశారు. మీడియా, జర్నలిస్టులంటే తమకు గౌరవం ఉందని, అయితే తమ గురించి కథనాలు రాసే సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆంధ్రా మీడియా నుంచి తమకు ఎలాంటి సర్టిఫికెట్ అవసరం లేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# భూములు అమ్మి.. అప్పులు చేసి.. సంక్షేమం?

( మొదటిపేజీ తరువాయి )

ప్రభుత్వ హామీలు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల రుణాలు, ఇతర ఆర్థిక బాధ్యతలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అప్పుతో ప్రభుత్వం ఏం సృష్టిస్తోంది? మౌలిక వసతులు, ఉత్పాదక ఆస్తులు, పరిశ్రమలకు అవసరమైన వసతులు పెరుగుతున్నాయా? భవిష్యత్‌లో ఆదాయం తీసుకురాగల పెట్టుబడులు ఎంత? అన్నది కూడా రుణభారం కంటే ముఖ్యమైన కొలమానం.

**సంక్షేమానికి వేల కోట్లు..**

202627 బడ్జెట్‌లో ఆరు హామీలు, వాటికి సంబంధించిన పథకాలకు కలిపి రూ.50,713 కోట్ల కేటాయింపులు ఉన్నాయి. ఇందులో రైతు భరోసాకు రూ.18,000 కోట్లు, చేయూతకు రూ.14,861 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.5,500 కోట్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణానికి రూ.4,305 కోట్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.2,080 కోట్లు కేటాయించారు. ఇవే కాకుండా విద్యుత్ సబ్సిడీకి రూ.14,000 కోట్లు, బియ్యం సబ్సిడీకి రూ.3,000 కోట్లు, కల్యాణలక్ష్మి-షాదీముబారక్‌కు రూ.3,683 కోట్లు, స్కాలర్‌షిప్‌లకు రూ.4,343 కోట్లు వంటి కేటాయింపులు ఉన్నాయి. సంక్షేమ పథకాలు సామాజిక భద్రతలో కీలకమైనవే. అయితే వాటి పరిధి, వ్యయం ఏటా పెరుగుతున్నప్పుడు అదే స్థాయిలో స్థిరమైన ఆదాయ వనరులు కూడా పెరగాల్సి ఉంటుంది. లేకపోతే భవిష్యత్ బడ్జెట్లలో సంక్షేమం, అభివృద్ధి, రుణ చెల్లింపుల మధ్య ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది.

**భూముల వేలం.. తక్షణ ఊరట..**

హైదరాబాద్ చుట్టుపక్కల ప్రభుత్వ భూముల వేలం తెలంగాణకు గతంలో భారీ మొత్తంలో ఆదాయం తెచ్చింది. 2023లో కోకాపేట




నియోపోలిస్‌లో 45.33 ఎకరాల ఏడు ప్లాట్ల వేలం ద్వారా రూ.3,319.60 కోట్లు సమకూరాయి. బద్వేల్‌లో 100 ఎకరాల వేలం ద్వారా రూ.3,625 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు అప్పట్లో ప్రభుత్వం వెల్లడించింది. నాలుగు లేఅవుట్ల ద్వారా కలిపి సుమారు రూ.7,100 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాయదుర్గం సహా హైదరాబాద్ పరిసరాల్లోని విలువైన భూముల వేలం కొనసాగుతోంది. ఆస్తి నిర్వహణలో భాగంగా అభివృద్ధి చేసిన ప్రభుత్వ భూములను విక్రయించి, ఆ నిధులను మౌలిక వసతులకు మళ్లించడం ఒక ఆర్థిక వ్యూహం కావచ్చు. కానీ ఆ భూముల అమ్మకాల ద్వారా వచ్చిన నిధుల్లో ఎంత మూలధన వ్యయానికి వెళ్లింది? ఎంత మేర ఇతర వ్యయాలకు వినియోగించారు? అన్న వివరాలు స్పష్టంగా ప్రజల ముందుకు రావాల్సి ఉంది. ఎందుకంటే భూమి విక్రయం ద్వారా వచ్చే ఆదాయం పునరావృతమయ్యేది కాదు.

**గతంలో విమర్శలు.. ఇప్పుడు సవాళ్లు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రుణభారం, ప్రభుత్వ ఆస్తుల విక్రయాలపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. 2023 డిసెంబర్ నాటికి రాష్ట్రానికి రూ.6,71,757 కోట్ల అప్పులు ఉన్నాయని ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం ఆధారంగా అప్పట్లో వెల్లడించింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణాల సమీకరణ, గత రుణాలకు సంబంధించిన అసలు-వడ్డీ చెల్లింపుల వివరాలను కూడా వెల్లడించింది. అయితే రాజకీయ ఆరోపణలకు అతీతంగా ఇప్పుడు అసలు కొలమానం ఒకటే. ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న అప్పులు భవిష్యత్ తరాలకు ఎంత భారాన్ని మిగులుస్తాయి? వాటితో ఎంత ఆస్తి, ఎంత ఆదాయ సామర్థ్యం సృష్టిస్తోంది? అన్నది కీలకంగా మారుతుంది. గత ప్రభుత్వ నిర్ణయాలను చూపించడం ద్వారా ప్రస్తుత ఆర్థిక బాధ్యత నుంచి కాంగ్రెస్ సర్కార్ తప్పించుకోవడం సాధ్యం కాదు. అదే సమయంలో గత ప్రభుత్వ కాలంలోని అన్ని బాధ్యతలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రస్తుత ప్రభుత్వ రుణభారాన్ని మాత్రమే చూడడం కూడా సమస్యకు పరిష్కారం చూపదు.

**ఆదాయం పెంచడంపైనే దృష్టి..**

ఆర్థిక ఒత్తిడి ఉందన్న విమర్శల మధ్య ప్రభుత్వం కూడా ఆదాయ సమీకరణపై దృష్టి పెడుతోంది. 2026 జులైలో ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన సమీక్షలో బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సమీకరణ పెంచాలని, లీకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ఇది ఒక కీలకమైన అంశాన్ని స్పష్టం చేస్తోంది. సంక్షేమ వ్యయం కొనసాగాలంటే ఆదాయ వృద్ధి కూడా కొనసాగాలి. పన్నుల వసూళ్లు, పరిశ్రమలు, ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్, సేవారంగం, పెట్టుబడులు, పట్టణ ఆర్థిక కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచకుండా కేవలం అప్పులు, ఆస్తుల విక్రయాలపై ఆధారపడటం స్థిరమైన ఆర్థిక నమూనా కాదు అన్నది ఆర్థిక నిపుణుల అంచనా.

**హామీల ఆర్థిక భారం ఎంత?**

ఎన్నికల సమయంలో పార్టీలు ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేస్తే ప్రజలకు తక్షణ ప్రయోజనం కల్పించవచ్చు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలు, బలహీన వర్గాలకు ప్రభుత్వ సహాయం సామాజిక భద్రతలో భాగమే. కానీ ప్రతి హామీకి ఐదేళ్ల ఖర్చు ఎంత? పదేళ్ల తర్వాత ఎంత? ఆదాయం తగ్గితే ప్రత్యామ్నాయం ఏమిటి? అన్న లెక్కలు ముందుగానే పార్టీల వద్ద.. అధికారంలో ఉన్న ప్రభుత్వం వద్ద ఉండాలి. అప్పుడే వస్తున్న ఆదాయం, ఖర్చు అవుతున్న రంగం, అందుకు చేస్తున్న కేటాయింపులపై స్పష్టత ఉండే అవకాశం ఉంది. 202526 బడ్జెట్‌లో ఆరు హామీలకు సంబంధించిన కేటాయింపులు రూ.56,084 కోట్లుగా ఉండగా, 202627లో సంబంధిత కేటాయింపులు రూ.50,713 కోట్లుగా నమోదయ్యాయి. అయితే కేటాయింపులు తగ్గడం ఒక్కటే ఆర్థిక భారం తగ్గిందని నిర్ధారించలేము. పథకాల పరిధి, లబ్ధిదారుల సంఖ్య, అమలు వ్యయం, ఇతర సబ్సిడీలను కలిపి చూడాల్సి ఉంటుంది.

**ప్రజల ముందుకు సమగ్ర లెక్కలు**

రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు అతీతంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒక సమగ్ర చిత్రం ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఉంది. రుణభారం ఎంత?

**ప్రభుత్వ హామీలు ఎంత?**

సంక్షేమ పథకాల భవిష్యత్ వ్యయం ఎంత? భూముల విక్రయాల ద్వారా ఎంత వచ్చింది? ఆ నిధులు ఎక్కడ ఖర్చయ్యాయి? మూలధన వ్యయం ఎంత? ప్రతి ఏడాది వచ్చే పన్ను, పరిశ్రమ, పెట్టుబడి ఆదాయం ఎంత పెరుగుతోంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభిస్తేనే రాష్ట్ర ఆర్థిక దిశపై ప్రజలకు పూర్తి అవగాహన ఏర్పడుతుంది.

**భూమి ఒక్కసారి.. ఆదాయం ప్రతిసారి?!**

భూమి అమ్మితే వచ్చే ఆదాయం ఒక్కసారే వస్తుంది. పన్ను, పరిశ్రమ, పెట్టుబడి, ఉద్యోగం, సేవారంగం ద్వారా వచ్చే ఆదాయం మాత్రం ప్రతి ఏడాది వస్తుంది. ఈ తేడానే తెలంగాణ ఆర్థిక విధానానికి కీలకం. సంక్షేమం ఆగకూడదు. అభివృద్ధి ఆగకూడదు. కానీ రెండింటి భారాన్ని మోయగల స్థిరమైన ఆదాయ వ్యవస్థ మాత్రం బలపడాలి. అప్పులతో ఆస్తులు సృష్టిస్తే అవి భవిష్యత్ ఆదాయానికి బాట వేయాలి. భూములు విక్రయిస్తే ఆ నిధులు ఉత్పాదక పెట్టుబడులుగా మారాలి. సంక్షేమ పథకాలు కొనసాగితే వాటి దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యతలకు ముందస్తు ప్రణాళిక ఉండాలి. తెలంగాణ ధనిక రాష్ట్రం కావడం మాత్రమే కాదు.. ఆ సంపదను స్థిరమైన ప్రభుత్వ ఆదాయంగా, ఉపాధిగా, పెట్టుబడిగా మార్చగలగడమే అసలు ఆర్థిక పరీక్ష.



# నేపాల్‌లో వరదల విలయం

( మొదటిపేజీ తరువాయి )

ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మొత్తం 384 మంది పర్యాటకులు మిస్సింగ్ అయ్యారని నేపాల్ టూరిజం బోర్డు ప్రకటించింది. ఇందులో 291 మంది విదేశీయులు, 93 మంది నేపాలీలు ఉన్నారని వెల్లడించింది. అదృశ్యమైనవారిలో 105 మంది భారతీయులు ఉన్నారని ఓ అధికారి తెలిపారు. రసువా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 26 మంది నేపాల్ భద్రతా సిబ్బంది కూడా గల్లంతయ్యారు. వరద ధాటికి నేపాల్ పోలీస్‌కు చెందిన మూడు భద్రతా ఆఫీసులు పూర్తిగా కొట్టుకుపోయాయి. టిబెట్ సరిహద్దులో ఉన్న ప్రముఖ వ్యాపార కేంద్రం తిమురే బజార్‌తో పాటు అక్కడే కస్టమ్స్ కాంప్లెక్స్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అక్కడ నిలిపి ఉంచిన అనేక వాహనాలు, సరుకులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. చైనాతో నేపాల్‌కు రవాణా అనుసంధానంగా ఉన్న 'ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జి' వరద దాటికి కొట్టుకుపోయింది. ఈ వరదల ప్రభావంతో నేపాల్ విద్యుత్ మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 6 జల విద్యుత్ కేంద్రాలను దెబ్బతిన్నాయి.

**రెస్క్యూలో అవరోధాలు.. ప్రధాని సమీక్ష**

సహాయక చర్యల కోసం ఆర్మీ, పోలీస్, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ దళాలను నేపాల్ ప్రభుత్వం రంగంలోకి దింపింది. అయితే, వరద ఉద్ధృతి ఊహించని విధంగా ఉండటంతో సహాయక చర్యలు ఇబ్బందికరంగా మారాయి. అత్యవసర వైద్య బృందాలతో పాటు ఆర్మీకి చెందిన రెండు హెలికాప్టర్లను ప్రభావిత ప్రాంతాలకు పంపారు. కానీ, భోటే కోశి, త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాలలో నీటి మట్టం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో హెలికాప్టర్లు ల్యాండింగ్ కాలేని పరిస్థితి నెలకొంది. ఈ పెను విషాదంపై నేపాల్ ప్రధాని బాలేంద్ర షా జాతీయ విపత్తు నివారణ విభాగం, కేబినెట్ మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ వరద ఇంత భారీగా రావడం వెనుక టిబెట్ వైపు ఉన్న మంచు సరస్సు పగలడం కారణం కావొచ్చని అనుమానిస్తున్నారు. కాగా భోటే కోశి నది టిబెట్‌లో ప్రారంభమై నేపాల్ గుండా ప్రవహించి , భారతదేశంలోకి గండక్ నదిగా ప్రవేశిస్తుంది. వరదల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రం బీహార్ ప్రభుత్వం సైతం అప్రమత్తమైంది.

# గల్లీ కుర్రాళ్లూ ఒలింపిక్స్‌లో అదరగొట్టాల్సిందే

- ఒలింపిక్సే లక్ష్యంగా రేవంత్ మాస్టర్ ప్లాన్
- భారత్ గర్వించే అథ్లెట్లను తయారు చేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- దక్షిణ కొరియా పర్యటనలో ఉన్నప్పుడు కేఎన్ఎస్‌యూ బృందాన్ని కలిసిన సీఎం

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):**

పల్లెలు, పట్టణాల నుంచి ఒలింపిక్ పోడియం వైపు ప్రయాణానికి తెలంగాణ సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం యంగ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీతో ఎంవోయూ చేసుకుంది. ఎంవోయూపై హర్షం వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచంలోని అత్యున్నత క్రీడా ప్రతిభ సంస్థల్లో ఒకటైన కేఎన్ఎస్‌యూతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంవోయూ చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. దక్షిణ కొరియా వెళ్లినప్పుడు కేఎన్ఎస్‌యూ బృందాన్ని కలిసి భాగస్వామ్యంపై చర్చించిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఎంవోయూ తెలంగాణ క్రీడా ప్రతిభకు అథ్లెటిక్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, అత్యున్నత స్థాయి విద్య విధానాలకు వారధిగా సీఎం అభివర్ణించారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా 31 పతకాలు సాధించగా అందులో కేఎన్ఎస్‌యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు 16 మంది ఉన్నారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కేఎన్ఎస్‌యూ విశిష్ట సంస్కృతి రాష్ట్రానికి తీసుకురావాలనుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో యువ అథ్లెట్లకు ప్రపంచ స్థాయి క్రీడా సామర్థ్యాలు నేర్చుకునే కొత్త అవకాశాలు సృష్టించేలా ఎంవోయూ చేసుకోవడంలో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, అధికారులు కీలక పాత్ర పోషించారంటూ రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# పేదవాడి ఇంటికి మేము భరోసా..

- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా వెనక్కి తగ్గం
- ఇందిరమ్మ ఇండ్ల కోసం కేంద్రం సహాయం అందిస్తుందన్న ఆశతో ఎదురు చూశాం..
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో: ( ప్రభంజనం )**

పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 201423 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదని, దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని అనేకమార్లు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న నమ్మకంతో ఇప్పటివరకు




పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చివరి బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ను పలుమార్లు కలిసి తెలంగాణకు ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కేంద్ర మంత్రి వచ్చిన సందర్భంలో, రెండు వారాల క్రితం పార్లమెంటు సభ్యులతో కలిసి నేను స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశానని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదని అన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశ పెట్టుకుని పేద ప్రజలను ఇంకా ఎన్నాళ్లు ఇబ్బంది పెట్టాలి? ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు చివరి బిల్లు కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. కేంద్రం తన బాధ్యత నిర్వర్తించకపోయినా పేదవాడి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్వర్తిస్తుందని అన్నారు పొంగులేటి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించక పోయిన కూడా పేదల సొంతింటి కలను నెరవేర్చడాన్ని ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి వెల్లడించారు. మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో గురువారం జమ అవుతాయని తెలిపారు. మిగిలిన వారికి కూడా విడతల వారీగా ఇస్తాం. ఇందులో ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

# కోదాడ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

- కంటెనర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు..
- ఆరుగురు మృతి, 20 మందికి గాయాలు
- క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు
- కోదాడ మండలం ద్వారకుంట దగ్గర ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**నల్గొండ బ్యూరో: ( ప్రభంజనం )**

సూర్యాపేట జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కోదాడ మండలం ద్వారాకుంట శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి ఏలూరు




వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. తెల్లవారుజామున బస్సు ద్వారాకుంట శివారుకు చేరుకున్న సమయంలో ఆగి ఉన్న కంటైనర్ లారీని బలంగా ఢీకొట్టింది. బస్సు ఢీకొన్న తీవ్రతకు బస్సు ముందు భాగం దెబ్బతినడంతో పలువురు ప్రయాణికులు బస్సులో ఇరుక్కుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికుల ఆర్తనాదాలతో ఘటనా స్థలం విషాదకరంగా మారింది. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను పోలీసులు, రెస్క్యూ సిబ్బంది బయటకు తీసి అంబులెన్సుల ద్వారా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. మరో మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. వారికి వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. మృతుల పూర్తి వివరాలు, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం కారణంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరిస్తూ ట్రాఫిక్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

**సీఎం ప్రగాఢ సానుభూతి..**

ప్రమాద ఘటనకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

ప్రభంజనం

POLITICAL news

WWW.PRABANJANAM.COM

27.08.2026

గురువారం, హైదరాబాద్

/prabanjanam




## ఆయిల్‌పామ్ హబ్‌గా తెలంగాణ!



- **వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు**
- **సూర్యాపేట - ఖమ్మం - కొత్తగూడెం కారిడార్ ఏర్పాటు**
- **తెలంగాణలో మరో 21,230 ఎకరాలకు ఆయిల్‌పామ్ విస్తరిస్తాం**
- **రైతులకు 30 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయం: ఆయిల్‌పామ్ సాగుపై మంత్రి ఉత్తమ్ ప్రకటన**

**హైదరాబాద్, (ప్రభంజనం):**

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగుకు భారీ ప్రోత్సాహం కోసం ప్రత్యేక కార్యాచరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వరి పంటకు లాభదాయక ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ విస్తరణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టిందన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. సూర్యాపేటలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్‌పామ్ హబ్ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ఆసక్తి కనబరుస్తోందని చెప్పారు. కోదాడ హుజూర్‌నగర్ నుంచే ఆయిల్‌పామ్ విస్తరణ ప్రారంభించాలని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. సూర్యాపేట ఖమ్మం కొత్తగూడెం జిల్లాలతో భారీ ఆయిల్‌పామ్ కారిడార్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.రైతుకు ఆదాయం..సాగునీటికి పొదుపు..రాష్ట్రానికి పరిశ్రమే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రైతును వరి నుంచి మళ్లించాలంటే మెరుగైన ఆదాయం, మార్కెట్ భరోసా ఉండాలని అన్నారు. ఫార్మ్‌టు ఇండస్ట్రీ విధానంలో ఆయిల్‌పామ్ సాగు ప్రాసెసింగ్‌కు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. సబ్బులు, పామ్ ఆధారిత వినియోగ వస్తువుల తయారీకి భవిష్యత్‌లో అవకాశం ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 3.12 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అవుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 65,691 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగులో భాగస్వామ్యం అయ్యారని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఆయిల్‌పామ్ విస్తరణకు ఇప్పటివరకు రూ.515.84 కోట్ల వ్యయం అయిందని వివరించారు. 2023 డిసెంబర్ తర్వాత కొత్తగా 1.29 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అవుతోందని స్పష్టం చేశారు. 2026 27లో మరో 21,230 ఎకరాలకు ఆయిల్‌పామ్ విస్తరణ చేస్తామన్నారు. సూర్యాపేటలో ప్రస్తుతం 5,753 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అవుతోందని వివరించారు.ఆయిల్‌పామ్ తోటలతో స్థిరపడితే దాదాపు 30 ఏళ్ల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. భారీ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ఎఫ్‌ఎఫ్‌బీ లభ్యతపై రిలయన్స్ క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తుందని తెలిపారు. త్వరలో కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెంలో రిలయన్స్ సంస్థ ప్రతినిధుల పర్యటిస్తారని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. వరి కొనుగోలు, రవాణా, మిల్లింగ్, నిల్వపై ప్రభుత్వ భారాన్ని తగ్గించడమే లక్ష్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్ విస్తరణతో సాగునీటిపై ఒత్తిడి తగ్గించి రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఆయిల్‌పామ్ కార్యక్రమంతో ప్రస్తుతం 14 కంపెనీల అనుసంధానం అయ్యాయన్నారు. వంటనూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో తెలంగాణ కీలక పాత్ర వహిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

# తెలంగాణలో మరో జెన్‌జీ ఉద్యమం తప్పదు

## పేదల భూములు లాక్కుంటే ఊరుకోం.. ఖబడ్దార్ బిడ్డా: మాజీ మంత్రి హరీష్

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):**



సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. ఖబడ్దార్ భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. జెన్‌జీల పోరాటం దెబ్బకు కేంద్ర ప్రభుత్వమే షేక్ అయ్యిందని తెలిపారు. సెక్షన్ 22ఏ రద్దు చేయకుంటే ఢిల్లీ తరహా ఉద్యమాన్ని రుచి చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసిపోయిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. 98 శాతం భూములను తీసేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని అన్నారు. సెక్షన్ 22ఏ కారణంగా చాలామందికి లోన్లు రాలేదని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు బాధపడాలని ప్రశ్నించారు. సెక్షన్ 22ఏ పెట్టింది మీరే.. తీసేయాల్సింది కూడా మీరే అని స్పష్టం చేశారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని నిలదీశారు. మీ తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు.

మీరే చేసిన తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని అడిగారు. తప్పు చేసింది మీరు.. సరిదిద్దుకోవాల్సింది కూడా మీరేనని పునరుద్ఘాటించారు. ప్రజల నుంచి 30 శాతం కమీషన్లు గుంజుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి బ్రోకర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏజెంట్లు కాలనీల్లో తిరుగుతున్నారని తెలిపారు. ప్రజలు ఒక్క రూపాయి కూడా బ్రోకర్లకు ఇవ్వద్దని సూచించారు. మీ ఆస్తులను కాపాడి మీకు అప్పగించే బాధ్యత మాది అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ మొదలవుతుందని తెలిపారు. అసెంబ్లీలో సెక్షన్ 22ఏపై పోరాడతామని పేర్కొన్నారు. కబ్జాదారులే ధర్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మెడలు వంచి మీకు న్యాయం చేసే బాధ్యత మాపై ఉందని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

## భూ భారతి అతిపెద్ద కుంభకోణం

**( మొదటిపేజీ తరువాయి )**

ఆధారాలతో అసెంబ్లీకి నేను చర్చకు వస్తే రాకుండా మంత్రి పారిపోయారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి'' అని ఏలేటి డిమాండ్ చేశారు. కుట్ర చేసి నిషేధిత జాబితాలో భూములు పెడితే విచారణ జరపాలి. సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ లేదా హౌజ్ కమిటీ వేస్తారా స్పష్టం చేయాలి. భూ భారతి మంత్రులకు నగల, వజ్రాల హారంగా మారింది. కాంగ్రెస్ 33 నెలల పాలనలో భూ భారతి అతిపెద్ద కుంభకోణం. సీఎం రేవంత్ చెప్పిన అసలు కుట్ర ఆయన కేబినెట్‌లోనే జరుగుతుంది. 22A బాధితులకు న్యాయం చేయాలి. కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. బాధ్యులపై క్రిమినల్ కేసులు కూడా పెట్టాలి. 22A అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి. అంతేకాదు సీబీఐ విచారణ కోరుతూ ప్రభుత్వం లేఖ రాయాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీనామా చేయాలి'' అంటూ మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## పెళ్లి చేసుకుంటానంటూ మోసం

- **టాలీవుడ్ దర్శకుడి అరెస్ట్**

**సిటీ క్రైమ్: ( ప్రభంజనం )**

టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ పవన్ సాధినేని ఓ వివాదంలో చిక్కుకున్నారు. ఆయనపై ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. తనను పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి పవన్ సాధినేని తనను మోసం చేశాడంటూ సదరు నటి తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో హైదరాబాద్ పోలీసులు పవన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పవన్ సాధినేనికి ఇప్పటికే వివాహమైంది. ఆయన 'ప్రేమ ఇష్క్ కాదల్' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'సావిత్రి', 'సేనాపతి' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. కేవలం సినిమాలే కాకుండా వెబ్ సిరీస్‌లను సైతం ఆయన తెరకెక్కించారు.

## కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి

- **సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు కేటీఆర్ పిలుపు**
- **వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలు**
- **420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్**
- **'బాకీ కార్డుల'తో హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి**
- **గ్రామగ్రామాన ప్రజలకు కాంగ్రెస్ మోసాన్ని తెలియజెప్పాలి**
- **పార్టీ శ్రేణులకు బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు**

**తెలంగాణ బ్యూరో: ( ప్రభంజనం )**

అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి- - - వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి- - -తర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా వారం రోజులపాటు కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



**100 రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు 1000 రోజులైనా నెరవేర్చలేదు..**

రాష్ట్ర ప్రజలకు 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ అన్నారు. అయితే 1000 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఆ పార్టీ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల తెలంగాణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా విధానాలు, వైఫల్యాలు, అవినీతి, అరాచకాలను ప్రజల ముందుంచాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. ఆయా వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల తాలూకు బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకుపోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతి ఒక్కరినీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి వర్గానికి ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలు, ఆయా వర్గాలకు రావాల్సిన ప్రయోజనాలు, బకాయిల వివరాలను ప్రజల ముందుంచాలని సూచించారు. విద్యార్థులకు రూ.12 వేల కోట్లకు పైగా ఫీజులు చెల్లించకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును అన్ని కాలేజీల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రజల్లో విస్తృతంగా చర్చకు తీసుకురావాలని సూచించారు. యువతకు ఏ విధంగా ఉద్యోగాలు ఇవ్వకుండా, హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందో ఇప్పటికే సరూర్‌నగర్‌లో నిర్వహించిన సభ, యువ సంగ్రామ సదస్సు ద్వారా ఎండగట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి సంబంధించిన కార్యాచరణలో భాగంగా మరోసారి యువతకు కాంగ్రెస్ చేసిన మోసాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చిన ఆటో డ్రైవర్లు, ఆడబిడ్డలు, అన్నదాతలు, గిరిజనులు, దళితులు, బీసీలు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్క వర్గాన్ని ప్రత్యేకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలని కేటీఆర్ సూచించారు. ఒకే తరహా కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఆయా వర్గాల సమస్యలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఏడు రోజులపాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గాల్లో మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులు, దళితులు, బీసీలు, గిరిజనులు తదితర వర్గాలను ప్రత్యేకంగా కలుస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. హామీలు మాత్రమే కాకుండా ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలను కూడా కార్యక్రమాల్లో ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు సహా అన్ని స్థాయిల నాయకులు పాల్గొనాలని కేటీఆర్ తెలిపారు.

## లక్ష్మీదేవి గోదా దేవి సమేత వేంకటటేశ్వర స్వామి కళ్యాణం

**కంటోన్మెంట్,(ప్రభంజనం)**

చిన్న తిరుపతిగా విరాజిల్లుతున్న బోయిన్ పల్లి న్యూసిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి గోదా దేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. ప్రధాన అర్చకుడు ఫణిస్వామి ఆధ్వర్యంలో లక్ష్మీగోదాదేవిల సమేత కళ్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదమం త్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణ ఘట్టాలు శాస్త్రోక్తంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని కనుల వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధికంగా భక్తులు తరలిరావడంతో ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది.

## శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక ఈద్ మిలాద్‌ఉన్‌నబీ

**కంటోన్మెంట్,(ప్రభంజనం)**

మహమ్మద్ ప్రవక్త జన్మదినం ఈద్ మిలాద్‌ఉన్‌నబీ పురస్కరించుకుని కంటోన్మెంట్ బోర్డ్ పరిధి ఆరోవ వార్డ్‌లో బుధవారం తాడ్‌బంద్ ప్రాంతంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు వేర్వేరు ప్రాంతాలలో చిన్నారులకు బిస్కెట్లు, టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ పవిత్ర పర్వదినాన ప్రజలంతా సుఖసంతోషాలతో, ఐక్యమత్యంతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు మైనార్టీ బీజేపీ అధ్యక్షులు దావూద్, సలీం, అన్నూ భాయ్ , స్థానిక మస్జిద్ కమిటీ చైర్మన్ అజీజ్ , అబిద్, డా.రషీద్, జాకీర్ ల తో పాటు స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నా బిడ్డ వ్యాఖ్యలతో నాకేం సంబంధం?

- **సుస్మిత ప్లాన్-బి ఏంటో నాకు తెలియదు**
- **కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతాం.. కొండా మురళి సంచలన వ్యాఖ్యలు**
- **పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారంలో నిజం లేదు.. కొండా మురళి క్లారిటీ**
- **సోనియా, రాహుల్, ప్రియాంకలపై తమకు పూర్తి విశ్వాసం ఉంద వెల్లడి**

**హైదరాబాద్, (ప్రభంజనం):**

తాము కాంగ్రెస్ పార్టీని ఎట్టి పరిస్థితుల్లో వీడేది లేదని కాంగ్రెస్ నేత, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి స్పష్టం చేశారు. తమ కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌లతో కొండా మురళి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమావేశం అయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకపై తమకు విశ్వాసం ఉందన్న కొండా మురళి కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడనని కొండా మురళి తెలిపారు. సుస్మిత ప్లాన్‌బి ఏమిటో తెలియదు : ప్రజా భవన్‌లో జరిగిన భేటీలో కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించలేదని తెలిపారు. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని, ఆమె ప్లాన్‌ఏ ప్రకారం వ్యాఖ్యలు చేసిందని, ప్లాన్‌బి ఏమిటో తనకు తెలియదన్నారు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారని, నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారని గుర్తు చేశారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడనని వెల్లడించారు.

> **ఇవాల్టికి వరంగల్ కూడా పోలేదు. కాంగ్రెస్‌ను వీడేది లేదు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే నాకు అభిమానం. సుస్మిత నా బిడ్డ. నాకు ఉన్నది ఒక్కతే బిడ్డ. భట్టితో యోగ క్షేమాలు మాట్లాడుకున్నాం. వివాదానికి నాకు సంబంధం లేదు. వివాదం నా బిడ్డది. వివాదంపై నేను మాట్లాడను. నా బిడ్డ ప్లాన్ ఏ లో మాట్లాడింది. ప్లాన్ బి లో ఏముంది అనేది నాకు తెలియదు.**
>
> **- కొండా మురళి, కాంగ్రెస్ నేత, మంత్రి కొండా సురేఖ భర్త**

**అందుకోసమే వచ్చాను..**

ఈ సమావేశంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గ బిల్లుల కోసమే భట్టి విక్రమార్కని కలిశానని తెలిపారు. అప్పటికే ప్రజాభవన్‌లో కొండా మురళి ఉన్నారని పేర్కొన్నారు. మరోవైపు ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కతో కొండా మురళి, రాజగోపాల్‌రెడ్డి సమావేశమైన సమయంలోనే ప్రజాభవన్‌కు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా భేటీలో పాల్గొన్నారు. తరువాత సమావేశం నుంచి కొండా మురళి అర్ధంతరంగా వెళ్లిపోయారు.

## OPEN voice

# ఆరో పంచప్రాణం లేఖ్య

కవిత్వం అనేది అనుభూతి సాంద్రతతో, భావుకతా పరిమళంతో నిండిన అక్షర రూపం. పాఠకుడి హృదయాన్ని తాకినప్పుడు అది కేవలం కాగితంపై అక్షరాలుగా మిగలదు. ఆత్మీయ సంభాషణగా మారుతుంది. సమకాలీన తెలుగు కవిత్వంలో కవి మెట్టా నాగేశ్వరరావు రచించిన 'లేఖ్య' కవితా సంపుటి అలాంటి హృద్యమైన కవితా సృష్టి. ఒక తండ్రి తన కూతురిపై పెంచుకున్న అపారమైన ప్రేమతో పాటు, ఆడపిల్ల ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం, భద్రత, సాధికారతలను ఇందులో ఆర్ద్రంగా చిత్రించారు.




సాంప్రదాయ పితృస్వామ్య భావజాలంలో కొడుకుకే అధిక ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో, కూతురి ఉనికిని విశ్వానికి జీవశక్తిగా చూడటం 'లేఖ్య'లోని ప్రధాన వైశిష్ట్యం. "నీటిని ఆర్పే నిప్పుని / నిప్పుని కనే గాలిని / గాలిని తుమ్మే ఆకాశాన్ని / ఆకాశాన్ని అద్దంలో చూసే భూమిని / కలిపే ఆరో పంచప్రాణం... ఆడపిల్ల!!" అనే భావన ద్వారా కవి ఆడపిల్లను పంచభూతాలను సమన్వయపరిచే ఆరో ప్రాణంగా ప్రతిష్ఠించారు. ఇది తండ్రి ప్రేమను మాత్రమే కాక, ఆడపిల్ల పట్ల సమాజ దృక్పథాన్ని మార్చే సామాజిక సందేశం. ఆడపిల్ల జననాన్ని భారంగా భావించడం, భ్రూణహత్యలు చేయడం, స్త్రీని ద్వితీయశ్రేణి వ్యక్తిగా చూడడం వంటి దురాచారాలపై కవి తీవ్రంగా స్పందించారు. "ఈ మగాడ్ని కన్నది / ఏ మగాడు అనీ!?" అనే ప్రశ్న ద్వారా ప్రతి పురుషుడి జననానికి మూలం ఒక స్త్రీనే అన్న సత్యాన్ని గుర్తుచేశారు. స్త్రీని భోగవస్తువుగా కాక, సృష్టి, పోషణ, పరివర్తనలకు మూలమైన శక్తిగా చూడాలనే సందేశం ఈ సంపుటిలో బలంగా వ్యక్తమవుతుంది.

'లేఖ్య'లో తండ్రి-కూతుళ్ల అనుబంధం అత్యంత సహజంగా, ఆత్మీయంగా ప్రతిఫలించింది. సాధారణంగా తండ్రి తన ప్రేమను మాటల్లో కాకుండా హృదయంలో దాచుకుంటాడు. ఆ మౌన ప్రేమకు కవి అక్షరరూపం ఇచ్చారు. "జీతం మెట్లు ఎక్కి ఎక్కి / సాయంత్రానికి జీవితంలో దిగుతాను / అప్పుడు ఇంట్లో / పట్టీలకాళ్లు నవ్వుతాయి / అప్పుడు... / కొండ మీదనే కాదు / గుండె మీదా దేవుడు వెలుస్తాడు!" అనే పాదాల్లో పసిపాప ఉనికి తండ్రి అలసటను ఎలా పారద్రోలుతుందో అద్భుతంగా ఆవిష్కరించారు.

కవి ఉపయోగించిన రూపకాలు, ప్రతీకలు కవిత్వానికి ప్రత్యేకమైన సౌందర్యాన్ని అందించాయి. కూతురిని సీతాకోకచిలుకగా, ఆమె ప్రేమను సువాసనగా, ఆమె నవ్వును దైవానుభూతిగా చిత్రించడం ద్వారా అమూర్తమైన తండ్రి ప్రేమకు స్పష్టమైన రూపాన్ని ఇచ్చారు. తండ్రి స్వగతం అనే శైలిని ఎంచుకోవడం వల్ల ఈ కవితలు పాఠకుడికి నేరుగా హృదయ సంభాషణలా అనిపిస్తాయి.

'లేఖ్య' కేవలం ముద్దుమురిపాల కవిత్వం కాదు. ఆధునిక డిజిటల్ ప్రపంచంలో ఆడపిల్లలు ఎదుర్కొనే ప్రమాదాలపైనా కవి అప్రమత్తం చేశారు. ఫోన్, సోషల్ మీడియా, మాయపూరిత పరిచయాలు వంటి అంశాల విషయంలో విచక్షణతో ఉండాలని సూచించారు. "Apps లైఫ్ కాదు happy లైఫ్ కావాలి" అనే సందేశం ద్వారా సాంకేతికతను ఉపయోగించాలి కానీ దానికి బానిస కాకూడదని హెచ్చరించారు.


ఆర్థిక స్వావలంబనకు కూడా కవి విశేష ప్రాధాన్యం ఇచ్చారు. "కూతురమ్మా! / నీ పర్సు నీవు సాధించుకోవాలె" అంటూ తన కాళ్లపై తాను నిలబడాలని కూతురిని ప్రోత్సహించారు. ఆమె ఆత్మగౌరవం కోసం అవసరమైతే తాను శ్రమించడానికి సిద్ధమని చెప్పడం తండ్రి ప్రేమలోని నైతికతను, సమానత్వ దృక్పథాన్ని తెలియజేస్తుంది.

అలాగే ప్రకృతి, జీవకరుణ, అహింస వంటి విలువలను కూడా కవి బోధించారు. చిన్న జీవులపై పగ పెంచుకోకుండా దయ చూపాలని చెప్పడం ద్వారా కూతురి వ్యక్తిత్వాన్ని మానవీయ విలువలతో తీర్చిదిద్దాలనే తండ్రి ఆకాంక్ష కనిపిస్తుంది. సీతను కన్న జనకుడు, శకుంతలను పెంచిన కణ్వ మహర్షితో తనను పోల్చుకుంటూ "ఆడపిల్లల తండ్రి" కావడమే గొప్ప గౌరవమని కవి ప్రకటించారు.

స్త్రీ స్వేచ్ఛను ఎవరో ప్రసాదించే హక్కుగా కాక, సహజమైన జీవన హక్కుగా కవి అభివర్ణించారు. "స్వేచ్ఛ అడుక్కునేది కాదు / స్వేచ్ఛ జలపాతమై దూకి పారు" అనే పిలుపు ఆడపిల్ల స్వతంత్ర వ్యక్తిత్వానికి ప్రతీక. ఆమె భయపడకుండా ఎదగాలని, అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని పెంపొందించుకోవాలని కవి ఆకాంక్షించారు.

విశాఖ-గోదావరి ప్రాంతపు జీవభాష, పల్లె మట్టి వాసన, సరళమైన పదజాలం 'లేఖ్య'కు ప్రత్యేక ఆకర్షణను ఇచ్చాయి. పాండిత్య భారాన్ని పక్కనపెట్టి, పసిపాప నవ్వులంత నిర్మలమైన భాషలో గాఢమైన భావాలను పలికించడం కవి శిల్పనైపుణ్యానికి నిదర్శనం. ప్రతి కవితలోనూ ప్రేమ, ఆర్తి, సామాజిక చైతన్యం, రక్షణ భావన ఏకకాలంలో కనిపిస్తాయి.

మొత్తంగా 'లేఖ్య' ఒక తండ్రి తన కూతురికి రాసిన ప్రేమలేఖ మాత్రమే కాదు.. ఆడపిల్ల ఉనికిని గౌరవించే సామాజిక మేనిఫెస్టో, తండ్రి ఆత్మనివేదన, సమానత్వ సందేశం, భవిష్యత్ తరాలకు మార్గదర్శకమైన కవితా సంపుటి. ఆడపిల్లను ప్రేమించడమే కాదు——ఆమెను స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో, ధైర్యంగా, స్వావలంబనతో జీవించే వ్యక్తిగా తీర్చిదిద్దాలనే గొప్ప మానవీయ సందేశాన్ని 'లేఖ్య' అందిస్తుంది. అందుకే ఆడపిల్లను ఈ విశ్వానికి "ఆరో పంచప్రాణం"గా సంభావించిన ఈ కవితా సంపుటి తెలుగు సాహిత్యంలో విలువైన రచనగా నిలుస్తుంది.



- షేక్ మౌలాలీ
పరిశోధక విద్యార్థి
ఆంధ్ర విశ్వవిద్యాలయం

PRABANJANAM EDITORIAL

# ప్రజల విశ్వాసానికి దూరమవుతున్న రాజకీయ పార్టీలు!

## ఢిల్లీలో యువత ఉద్యమం.. రాజకీయ వ్యవస్థకు హెచ్చరిక

జంతర్‌మంతర్ వేదికగా అభిజీత్ దీప్కే నాయకత్వంలో యువత చేపట్టిన ఉద్యమం దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రారంభమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆలోచన క్రమంగా విద్య, ఉద్యోగాలు, పరీక్షల్లో పారదర్శకత, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపై యువత గొంతుకగా మారింది. అయితే దీనిని కేవలం విద్యార్థులు, ఉద్యోగార్థుల సమస్యగా మాత్రమే చూడటం సరైంది కాదు. రాజకీయ పార్టీలపై ప్రజల్లో క్రమంగా తగ్గుతున్న విశ్వాసానికి ఇది ఒక సంకేతంగా చూడాల్సిన అవసరం ఉంది.



- అర్వనపల్లి ప్రకాష్ రావు
న్యాయవాది & ప్రజా చైతన్య
సామాజిక కార్యకర్త




నేటి యువత ఎన్నో సంవత్సరాలు చదువుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. లక్షలాది మంది పరీక్షలు రాస్తున్నారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకులు లేదా నియామక ప్రక్రియలో పారదర్శకతపై అనుమానాలు తలెత్తితే యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఒక పరీక్ష రద్దు కావడం అంటే కేవలం ఒక పరీక్షను కోల్పోవడం కాదు.. ఒక యువకుడి జీవితంలో విలువైన సమయం, డబ్బు, అవకాశాలు వృథా కావడం.

ఇదే పరిస్థితి సామాన్య ప్రజల విషయంలోనూ కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం ఎదురుచూడటం, సంక్షేమ పథకాల కోసం అధికారుల చుట్టూ తిరగడం, రైతులు తమ హక్కుల కోసం పోరాడటం, వ్యాపారులు అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి సమస్యలు ప్రజలను విసిగిస్తున్నాయి. ప్రజలకు అందాల్సిన సేవ ఆలస్యం కావడం ఒక సమస్య అయితే, ఆ సేవ కోసం అనధికారికంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి మరింత తీవ్రమైన సమస్య.

అవినీతి అంటే కేవలం లంచం తీసుకోవడం మాత్రమే కాదు. ప్రజా నిధులను సక్రమంగా వినియోగించకపోవడం, నాణ్యత లేని పనులకు బిల్లులు చెల్లించడం, అధికారాన్ని స్వప్రయోజనాలకు ఉపయోగించడం, నియామకాల్లో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలు కూడా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అవినీతి వల్ల నష్టపోయేది కేవలం ప్రభుత్వ ఖజానా కాదు.. ఒక పేద కుటుంబం, ఒక విద్యార్థి భవిష్యత్తు, ఒక రైతు జీవితం, ఒక నిరుద్యోగి ఆశ.

ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రకటిస్తున్నాయి. భారీగా నిధులు కేటాయిస్తున్నాయి. అయినా వాటి ఫలితాలు ప్రజలకు పూర్తిగా ఎందుకు అందడం లేదన్న ప్రశ్నకు సమాధానం అవసరం. అవినీతి, రాజకీయ జోక్యం, జవాబుదారీతనం లోపం, పాలనా అసమర్థత వంటి కారణాలు దీనికి దోహదపడుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. "ప్రభుత్వం మారినా.. మా పరిస్థితి ఎందుకు మారడం లేదు?" అనే ప్రశ్న ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరిక.

### ప్రజల ప్రశ్నలకు రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాలి

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయి. ఎన్నికల సమయంలో ఉద్యోగాలు, అవినీతి నిర్మూలన, పారదర్శక పాలన, అభివృద్ధి వంటి హామీలు ఇస్తాయి. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలులో నిరాశ ఎదురైతే ప్రజల్లో క్రమంగా అసంతృప్తి పెరుగుతుంది. ఇది ఒక పార్టీకి మాత్రమే సంబంధించిన సమస్య కాదు. మొత్తం రాజకీయ సంస్కృతికి సంబంధించిన ప్రశ్న.

నేటి ప్రజలు కేవలం గొప్ప ప్రసంగాలు, భారీ సభలు కోరుకోవడం లేదు. ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, సురక్షిత జీవనం, అవినీతి రహిత పాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవం కోరుతున్నారు. నాయకుడిని మాత్రమే కాదు.. నమ్మదగిన వ్యవస్థను కోరుతున్నారు.

ఈ నేపథ్యంలో యువత ఉద్యమాన్ని కేవలం రాజకీయ వ్యతిరేకతగా కొట్టిపారేయడం సరైంది కాదు. అదే సమయంలో ప్రతి ఉద్యమం పూర్తిగా రాజకీయ రహితమని భావించడం కూడా సరైంది కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే.. యువత లేవనెత్తిన సమస్యలకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఎలా స్పందిస్తున్నాయన్నదే.

ఒక మంత్రి రాజీనామా చేయడం లేదా ఒక అధికారిని మార్చడం మాత్రమే సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. వ్యక్తులు మారడం కంటే వ్యవస్థలు మారాలి. పరీక్షా విధానంలో పారదర్శకత, నియామకాల్లో నిష్పక్షపాతత్వం, ప్రభుత్వ నిధుల వినియోగంపై కఠిన పర్యవేక్షణ, అవినీతిపై వేగవంతమైన చర్యలు, ప్రభుత్వ సంస్థల్లో జవాబుదారీతనం అవసరం.

యువతను కేవలం ఓటర్లుగా చూడకుండా ప్రశ్నించే పౌరులుగా, భవిష్యత్ నాయకులుగా చూడాలి. ప్రజలను ప్రశ్నించే హక్కు ఉన్న పౌరులుగా గౌరవించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

ఢిల్లీలో వినిపించిన యువత గొంతు కేవలం ఒక ఉద్యమం కాదు.. ప్రజల్లో పేరుకుపోతున్న అసంతృప్తికి అద్దం. రాజకీయ పార్టీలు ఈ సంకేతాన్ని అర్థం చేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేసే హక్కు కాదు. ప్రశ్నించే హక్కు, జవాబు కోరే హక్కు, అవినీతిని ప్రశ్నించే బాధ్యత కూడా. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే రాజకీయ పార్టీలు మాటలకంటే ఫలితాలను చూపించాలి.

యువత మేల్కొంటే ఉద్యమం పుడుతుంది.. ప్రజలు ప్రశ్నిస్తే జవాబుదారీతనం పుడుతుంది.. ప్రజల విశ్వాసాన్ని గౌరవించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.


### లోహవిచిత్రాలు



బంగారు సెగ
కొనెవారికి పొగ
తప్పదిక
ఆహార్యానికి
గిల్టు నగలు...
వెండి మెరపులు
చిరుత పరుగులు
దాటింది
రెండు లకారాలు...
లోహవిచిత్రాలు
పేదలకు
అందని ద్రాక్షలు
అందానికి
నల్లపూసలు

- రేడియమ్
9291527757

### నా మాట..




బలూచిస్థాన్ విముక్తి పోరాటంలో రాయితీలు, మధ్యేమార్గాలకు తావులేదు. సార్వభౌమ, స్వతంత్ర బలూచిస్థాన్ ఏర్పాటు చేయడమే తమ ఏకైక లక్ష్యం. పాకిస్థాన్ రాజ్యాంగం అనేది చచ్చిన గుర్రం లాంటిది. సైన్యం, న్యాయవ్యవస్థ, పార్లమెంట్, కార్యనిర్వాహక వర్గాల నుంచి తనను తాను కాపాడుకోలేని నిస్సహాయ స్థితిలో పాక్ రాజ్యాంగం ఉంది. విద్యావంతులైన బలోచ్ యువతను లక్ష్యంగా చేసుకుని బలవంతపు పాకిస్తాన్ సైన్యం అదృశ్యాలు, హత్యలకు పాల్పడుతుంది. కొత్త తరం యువత స్వాతంత్ర్య ఉద్యమం వైపు ఆకర్షితులవుతోంది. బలోచ్ స్వాతంత్ర్య ఉద్యమం కేవలం సాయుధ తిరుగుబాటు కాదు. అది పూర్తిస్థాయి జాతీయ విముక్తి పోరాటం.

- బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ ఎఫ్) అధినేత అల్లా నజర్ బలోచ్

### నా మాట..

ఈ దేశం ధర్మశాల కాదు. ఈ దేశంలో నివసించే హక్కు కేవలం ఈ దేశ పౌరులకు మాత్రమే ఉంటుంది. అక్రమ చొరబాట్లు దేశ భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉంది.



- అమిత్ షా కేంద్రమంత్రి

### నా మాట..

తమ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇకపై వందేమాతర గేయానికి సంబంధించి రెండు చరణాలనే ఆలపిస్తాము. దేశంలో భిన్న రకాలు వర్గాలు ఉన్నాయి. కాబట్టి అందరితో కలిసి ముందుకు నడవాలని మేము విశ్వసిస్తాము. సూర్యచంద్రులు, గాలి, నీటికి ఏ మతమూ లేదు



- కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్

రచయితలకు మనవి..
ప్రభంజనం ఎడిట్ పేజీ "ప్రజా గొంతుక"కు, సాహిత్య పేజీ "సాహితి"కి తమ రచనలు పంపగోరువారు ఈ క్రింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము.
రచనలు పంపాల్సిన చిరునామా..
WWW.PRABANJANAM.COM
WHATSAPP NO.
72859 59555



## ఘనంగా మిలాద్ ఉన్ నభి వేడుకలు

- **ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీ గణేష్, జంపన ప్రతాప్**

**కంటోన్మెంట్,(ప్రభంజనం)**

న్యూ బోయిన్ పల్లి పెన్షన్ లైన్ లో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నభి వేడుకలను బుధవారం ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, ఎమ్మెల్యే శ్రీ గణేష్. పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రపంచం నలుమూలల ముస్లిం సోదరులు ఈ జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో షకీబ్ హుస్సేన్, సీరాజ్, అమీర్, మౌలా, బల్వంత్ రెడ్డి, మారుతి గౌడ్ తో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు

- **ఓటర్ల జాబితాపై నేడు గ్రామ, వార్డుల్లో ప్రత్యేక సభలు**
- **నేడు రాష్ట్రవ్యాప్తంగా బీఎల్వోల ఆధ్వర్యంలో సభలు**
- **ఓటరు జాబితాలో లోపాలు సరిచేసుకునేందుకు అద్భుత అవకాశం**
- **73.39 లక్షల ఏఎస్డీడీ ఓట్ల తొలగింపుపై నేడు బహిరంగ చర్చ**
- **గ్రామ సభల వద్దే ఫారమ్-6, 7, 8లను అందుబాటులో ఉంచనున్న బీఎల్వోలు**

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామ/వార్డు సభలు కీలకం కానున్నాయి. ఈ సమావేశాల్లో బీఎల్వోలు కొత్త ముసాయిదా ఓటర్ల జాబితాలను చదివి వినిపించనున్నారు. అలాగే తొలగించిన ఏఎస్డీడీ (అందుబాటులో లేని, వలస వెళ్లిన, మరణించి లేదా నకిలీ ఓటర్లు) పరిధిలోకి చేర్చిన ఓటర్ల వివరాలను వెల్లడిస్తారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాల ప్రకారం రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 73.39 లక్షల మంది పేర్లను ఏఎస్డీడీ కింద తొలగించారు. రాష్ట్రంలో ఏఎస్డీడీలో చేర్చగా మిగిలిన 2.64 కోట్ల ఓటర్లకు సంబంధించిన వివరాల్లోనూ అనామలీస్ (లోపాలు) లేదా మ్యాపింగ్ సమస్యల కారణంగా 92.87 లక్షల మందికి ఎన్నికల సంఘం అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా




చూసేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సంఘం అధికారులు ఈ గ్రామ/వార్డు సభలను వేదికలుగా చేసుకుని చర్యలు చేపట్టనున్నారు.

**ప్రజల సమక్షంలో పేర్లను చదవడం..**

ఈ సమావేశాల్లో బూత్ స్థాయి అధికారులు ముసాయిదా, ఏఎస్డీడీ జాబితాలను బహిరంగంగా చదివి వినిపిస్తారు. ప్రజల సమక్షంలో పేర్లను చదవడం వల్ల ఏఎస్డీడీ జాబితాలో ఉన్నప్పటికీ వాస్తవానికి స్థానికంగా నివసిస్తున్న ఓటర్లను వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది. బోగస్ ఓట్ల వంటి తదితర అంశాలపై అభ్యంతరాలను నమోదు చేస్తారు. అదనంగా ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న వారి వివరాలను కూడా సేకరిస్తారు. గ్రామ లేదా వార్డు సభల వద్ద ఫారమ్ 6, ఫారమ్ 7, ఫారమ్ 8లను కూడా బీఎల్వోలు అందుబాటులో ఉంచుతారు. కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి, ముసాయిదా ఓటర్ల జాబితాలోని పేర్లపై అభ్యంతరాలు తెలపడానికి, అలాగే పేర్లు, చిరునామాలు లేదా స్పెల్లింగ్ కరెక్షన్ల వంటి లోపాలను సరిచేసుకోవడానికి ఈ ఫారమ్‌లను ఉపయోగిస్తారు. అవసరమైన ఫారమ్‌లను అక్కడికక్కడే నింపి సంబంధిత ఆధార పత్రాలతో సహా నేరుగా బీఎల్వోలకు సమర్పించవచ్చు.

**నోటీసులు వచ్చిన వారు ఏంచేయాలి?**


ఒకవేళ ఎవరైనా ఓటర్లు పొరపాటున ఏఎస్డీ (గైర్హాజరు, వలస, మరణం లేదా డూప్లికేట్) జాబితాలో వారి పేరు చేరినట్లైతే తగిన ఫారమ్‌ను అక్కడే నింపి ఇచ్చేలా చర్యలు బీఎల్వోలు చేపడతారు. గ్రామ లేదా వార్డు సభలలో చర్చించిన ప్రతి అంశం నమోదు చేసుకొని బీఎల్వోలు తమ రిజిస్టర్‌లో భద్రపరుస్తారు. అన్మ్యాపింగ్, అనామలీస్ కారణాల వల్ల నోటీసులు వచ్చిన ఓటర్ల నుంచి బీఎల్వోలు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో) అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరిస్తారు. ఈ క్రమంలో నోటీసు అందుకున్న ఓటర్లు ఈఆర్వో లేదా అసిస్టెంట్ ఈఆర్వో ముందు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందుకోసం ఓటర్లకు నిర్దిష్ట తేదీ, సమయాన్ని వెల్లడిస్తారు. ఒకవేళ ఆ సమయంలో ఓటర్ హాజరుకాకపోతే ఈఆర్వోలు మరో తేదీ ప్రకటిస్తారు. రెండోసారి కచ్చితంగా ఓటరు హాజరు కావాల్సి ఉంటుంది. నోటీసు వచ్చినంత మాత్రాన ఓటర్లు కంగారు పడొద్దని తగిన ధ్రువపత్రాన్ని సమర్పిస్తే సరిపోతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# ఏఐ డేంజర్ బెల్స్..

- **ఏఐతో మానవ సమాజానికి భారీ ప్రమాదం పొంచి ఉంది**
- **రోబోలు, ఏఐలను వాడితే ప్రత్యేక పన్ను వేయాలి**
- **ఉద్యోగ సంక్షోభంపై బిల్ గేట్స్ ఆందోళన**

**ఇంటర్నెట్ డెస్క్, (ప్రభంజనం):**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అంతర్జాతీయ సమాజానికి తీవ్ర హెచ్చరికలు చేశారు. ప్రభుత్వాలు గనుక త్వరితగతిన అప్రమత్తమై నిబంధనలు తీసుకురాకపోతే మానవ సమాజానికి భారీ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. గత సాంకేతిక విప్లవాలు ఉద్యోగ అవకాశాలను పెంచినప్పటికీ, ఏఐ విప్లవం మాత్రం అందుకు పూర్తి భిన్నమైనదని గేట్స్ స్పష్టం చేశారు. ఏఐ వల్ల అనేక ఉద్యోగాలు శాశ్వతంగా కనుమరుగైపోతాయని, కేవలం కొన్ని రంగాలు మాత్రమే మానవులకు ఉపాధిని ఇవ్వగలవని తెలిపారు. ఏఐ కోడింగ్ సామర్థ్యాలు తనను ఎంతగానో ఆశ్చర్యపరిచాయని, నిపుణులైన మనుషుల కంటే మెరుగ్గా పనిచేస్తున్న ఈ సాంకేతికత వల్ల సమీప భవిష్యత్తులోనే ఉపాధి రంగంలో తీవ్ర సంక్షోభం రానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ కంపెనీలు దీనివల్ల వచ్చే ముప్పును తక్కువ చేసి చూపిస్తున్నాయని, పెట్టుబడులు తగ్గిపోతాయనే భయంతో అసలు ఆందోళనలను బహిరంగంగా అంగీకరించడం లేదని విమర్శించారు. మనుషుల ఉపాధిని కాపాడేందుకు గేట్స్ కొన్ని సంచలనాత్మక ప్రతిపాదనలు చేశారు. ఏఐ, రోబోలను ఉపయోగిస్తూ మనుషులను ఉద్యోగాల నుంచి తొలగించే కంపెనీలపై ప్రత్యేక పన్ను విధించాలని, ఆ



ఆదాయంతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని సూచించారు. అలాగే కొన్ని రంగాలను కేవలం "మనుషులకు మాత్రమే పరిమితం" చేయాలని... ఉదాహరణకు వైద్యరంగంలో రోగికి వ్యాధి వివరాలు చెప్పడం లేదా కేర్ గివింగ్ వంటి బాధ్యతలను మనుషులే నిర్వహించేలా చట్టాలు తేవాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా, జీవాస్త్రాలు లేదా కొత్త రకం రసాయన ఆయుధాలను అభివృద్ధి చేసేందుకు ఏఐని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందంటూ హెచ్చరించారు. అణు ఆయుధాలు, అంతర్జాతీయ విమానయానానికి ఉన్నట్లే ఏఐ వినియోగం, నియంత్రణ కోసం ప్రపంచవ్యాప్తంగా కఠినమైన ఒప్పందాలు, పర్యవేక్షణ సంస్థలు ఏర్పాటు కావాలని సూచించారు.



## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా జస్టిస్ ఏ.శ్రీదేవి

**సిటీ బ్యూరో : ( ప్రభంజనం )**

నాగర్‌కర్నూల్‌లో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ ఏ. శ్రీదేవి బదిలీపై హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (సేషన్స్ డివిజన్) కార్యదర్శికమ్‌సీనియర్ సివిల్ జడ్జిగా నాంపల్లి క్రిమినల్ కోర్టు భవన సముదాయంలోని తన చాంబర్ లో బాధ్యతలను స్వీకరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, న్యాయ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం, లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారాన్ని ప్రోత్సహించడం, మధ్యవర్తిత్వం, ఇతర న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జస్టిస్ ఏ.శ్రీదేవి కృషి చేయనున్నారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది జస్టిస్ ఏ.శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నాపై పగ పెంచుకున్నారు

- **అదే కోపంతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేశారు**
- **కోపం ఉంటే నాపై చూపించండి నా నియోజకవర్గం మీద కాదు**
- **ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆగ్రహం**

**కూకట్ పల్లి: ( ప్రభంజనం )**

కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని మూడు భాగాలుగా విభజించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ప్రాణాలైనా అర్పించడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ పరిధుల్లోకి విభజించి మూడు ముక్కలు చేశారని మాధవరం కృష్ణారావు ఆరోపించారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరలేదనే కక్షతోనే నియోజకవర్గంపై ప్రభుత్వం ఈ తరహా చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. అదేవిధంగా 22ఏ నిషేధిత జాబితాలో స్థానిక కాలనీల భూములు, ఆస్తులను చేర్చడంపైనా ఆయన తీవ్ర అభ్యంత




రం వ్యక్తం చేశారు. వెంటనే ఆయా భూములు, ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తుల రక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తనను నియోజకవర్గ ప్రజలు 70 వేలకు పైగా భారీ మెజారిటీతో గెలిపించారని, హైదరాబాద్‌లో అత్యధిక మెజారిటీ సాధించిన నాయకుల్లో తాను ఒకరినని మాధవరం గుర్తుచేశారు. తనపై వ్యక్తిగత కోపం లేదా పగ ఉంటే తనపై చూపించాలని, కానీ తనను నమ్ముకున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కూకట్‌పల్లి ప్రజల హక్కులు, ఆస్తుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతానని మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు.

# పేదల బ్రతుకులకు విలువ లేదా?

- **నాళాలో పడి కనబడకుండా పోయిన బాలయ్య ఆచూకీ ఎప్పుడు కనుగొంటారు**
- **టీఆర్ ఎస్ నియోజకవర్గ ఇంఛార్జీ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్**

**శేరిలింగంపల్లి: ( ప్రభంజనం )**

ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో నాలాలో ప్రమాదవశాత్తు పడి గల్లంతైన ప్రేమ్‌నగర్‌కు చెందిన బాలయ్య (60)ఆచూకీ కోసం ప్రభుత్వం, అధికారులు తక్షణమే చర్యలు వేగవంతం చేయాలని టీఆర్ ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంఛార్జీ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. జులై 28న సాయంత్రం కురిసిన వర్షాల సమయంలో బాలయ్య నాలాలో పడి కొట్టుకుపోయారని, ఇప్పటివరకు ఆయన ఆచూకీ లభించకపోవడం బాధాకరమని వాసిలి అన్నారు. ప్రజాప్రతినిధులు, వారి బంధువులు లేదా ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ప్రమాదానికి గురైతే ఇదే విధంగా స్పందిస్తారా అని ప్రశ్నించారు. పేదలకు ఒక న్యాయం, ధనవంతులకు మరో న్యాయం ఉండకూడదని, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన అంటూ ఆయన నిలదీశారు. బుధవారం బాలయ్య భార్య పద్మను, వారి కుటుంబ



సభ్యులను వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా పద్మ తన భర్త ఆచూకీ కోసం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. కనీసం ఆయనకు సంబంధించిన అవశేషాలైనా తనకు అప్పగించాలని కోరడం అక్కడున్న వారిని కలచివేసిందని వాసిలి తెలిపారు. బాలయ్య కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వాసిలి డిమాండ్ చేశారు. బాలయ్య పిల్లలకు మున్సిపల్‌లో ఉద్యోగం కల్పించాలని, పద్మకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని, ప్రభుత్వం తరఫున రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. గతంలో 2019 ఆగస్టులో చందానగర్ డివిజన్‌లోని పీజేఆర్ రోడ్డులో పీజేఆర్ ఎంక్లేవ్ నాలాలో శ్రీకాంత్ రెడ్డి (35) ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటనను వాసిలి గుర్తుచేశారు. ఆ సమయంలో శ్రీకాంత్ రెడ్డి కుటుంబానికి తన సొంత నిధుల నుంచి రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు శ్రీకాంత్ రెడ్డి భార్యకు ప్రభుత్వం తరఫున ఉద్యోగం లేదా తగిన న్యాయం జరగలేదని ఆయన గుర్తు చేశారు. నాలాల చుట్టూ పటిష్టమైన రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాసిలి ప్రశ్నించారు. మరెంతమంది కుటుంబాలు నాలాల ప్రమాదాల కారణంగా రోడ్డున పడాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నాలాల చుట్టూ శాశ్వతంగా పటిష్టమైన కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. బాలయ్యను తిరిగి తీసుకురాలేకపోయినా, ఆయన కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని పద్మకు అందించినట్లు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు లావణ్య, సందీప్, దయానంద్, కుమార్, మురుగేసన్, విష్ణు, ప్రవీణ్, రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## శాంతి, సహనం, మానవ సేవను చాటేదే
# మిలాద్ ఉన్ నబీ పండుగ

- **ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

**మేడ్చల్ ప్రతినిధి (ప్రభంజనం):**

మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్ నగర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ (స) బోధించిన శాంతి, సహనం, పరస్పర గౌరవం, పేదల పట్ల దయ, మానవ సేవ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు. సమాజంలో ప్రేమ, సోదరభావం, ఐక్యతను పెంపొందించడమే మిలాద్ ఉన్ నబీ పండుగ సందేశమని పేర్కొన్నారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్‌లోని ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. "ప్రేమ, శాంతి, కరుణ - ప్రవక్త మహమ్మద్ (స) చూపిన మానవతా మార్గం" అనే సందేశంతో ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, డివిజన్ మైనారిటీ అధ్యక్షులు ఎండి. ఆజం, సీనియర్ నాయకులు సయ్యద్ సాజిద్, పాషా, ఖయ్యూమ్, మహమ్మద్ మెహమూద్, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ ఇబ్రహీం, మహమ్మద్ సోహెల్, ఎస్.కె. జావీద్, మహమ్మద్ ఖదీర్, మహమ్మద్ అక్బర్, సయ్యద్ జలీల్, సురేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**

**కీసర: ( ప్రభంజనం )**

పేదల కళ్లల్లో ఆనందం చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆరు గ్యారంటీ పథకాల అమలుతో తెలంగాణ స్వర్ణయుగంలా మారుతుందని కీసర డివిజన్ అధ్యక్షులు రామిడి స్వప్న రెడ్డి అన్నారు. కీసర డివిజన్ పరిధిలోని యాద్గర్ పల్లి గ్రామంలో బోయిని సరళ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రామిడి స్వప్న విజయ రెడ్డి పాల్గొన్నారు. వారికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రామిడి స్వప్న విజయ్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమకు సొంత ఇంటి కలను నిజం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయం

- **కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి**
- **నిజాంపేట్‌లో ఘనంగా మదర్ తెరిసా 116వ జయంతి వేడుకలు**

**మేడ్చల్ ప్రతినిధి (ప్రభంజనం):**

ప్రపంచ మానవాళికి మదర్ థెరిసా అందించిన సేవలు చిరస్మరణీయం అని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మదర్ తెరిసా 116వ జయంతి సందర్భంగా మదర్ తెరిసా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప లో గల మదర్ థెరిసా విగ్రహం వద్ద బుధవారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్,కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి), వరగాని వాసు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు ఉపయోగపడే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొలన్ శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు సూచించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన మదర్ తెరిసా అసోసియేషన్ సభ్యులను కొలన్ అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో ఎక్సైజ్ అధికారుల మెరుపుదాడి..
# 1.960 కిలోల ఎండు గంజాయి పట్టివేత



- **ఎన్ఎఫ్‌సీ నగర్‌లో గంజాయి విక్రయాల గుట్టురట్టు.. నిందితుడు అరెస్ట్**
- **గంజాయి ప్యాకెట్లు చేసి విక్రయం**
- **యువకుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎక్సైజ్**
- **బీదర్ నుంచి గంజాయి తెచ్చి విక్రయాలు**

**ఘట్కేసర్, (ప్రభంజనం):**

మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి భారీగా ఎండు గంజాయిని పట్టుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన అధికారులు, ఒక నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. బోడుప్పల్, వీరారెడ్డి కాలనీకి చెందిన మధాను నిఖిల్ కుమార్ (23). ఇతను ప్రస్తుతం ఘట్‌కేసర్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో అద్దెకు ఉంటూ గంజాయి విక్రయిస్తున్నాడు. మొత్తం 1.960 కిలోల ఎండు గంజాయి (బండి డిక్కీలో, బెడ్‌రూమ్‌లో దాచిన ప్యాకెట్లు), రవాణాకు వాడిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనం (టిఎస్ 08 హెచ్ఆర్ 6994), ఐఫోన్ 15 ప్రో మొబైల్, గంజాయి తూకం వేసే యంత్రం. నిందితుడు కర్ణాటకలోని బీదర్ వెళ్లి కిలో గంజాయిని రూ. 25,000 చొప్పున కొనుగోలు చేసి తెస్తున్నాడు. ఆ తర్వాత వాటిని 5 గ్రాముల చిన్న జిప్‌లాక్ ప్యాకెట్లుగా చేసి, ఒక్కో ప్యాకెట్‌ను రూ. 800 చొప్పున అవసరమైన వారికి అమ్ముతున్నాడు. విచారణలో నిఖిల్ గత ఐదేళ్లుగా గంజాయి తీసుకుంటున్నట్లు, సులభంగా డబ్బు సంపాదించేందుకు గత రెండు నెలలుగా ఇంట్లోనే ఈ అమ్మకాలు సాగిస్తున్నట్లు అంగీకరించాడు. పక్కా ప్రణాళికతో నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు, ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన వస్తువులు, ఇతర వీడియో ఆధారాలతో సహా నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

# కూకట్‌పల్లిలో 22ఏ భూముల రగడ

- **భూముల విక్రయాలు, అప్పుల దందాగా మార్చారు: హరీష్**
- **ప్రభుత్వ మెడలు వంచి 22ఏ నుంచి తొలగిస్తాం: బీఆర్ఎస్ స్పష్టీకరణ**

**కూకట్ పల్లి( ప్రభంజనం):**



కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 22ఏ భూముల సమస్యపై నిర్వహించిన సమీక్ష సమావేశం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ప్రభుత్వ నిరంకుశ విధానాలపై బీఆర్ఎస్, లోక్‌సత్తా నేతలు మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా పట్టా భూముల్లో నివసిస్తున్న సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చడం దారుణమని, ఇది ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని వారు ధ్వజమెత్తారు. సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పాల్గొని ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

**అభివృద్ధిని గాలికొదిలారు: హరీశ్‌రావు**

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు, పార్కులు, రహదారులు, ప్రజా రవాణా వంటి ఎన్నో సదుపాయాలు కల్పించామని, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశామని నాయకులు గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను గాలికొదిలేసి, కేవలం ఉన్న భూములను నమ్ముకోవడంపైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 22ఏ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**ప్రభుత్వానిది తప్పు.. ప్రజలకు ముప్పు.**

ప్రభుత్వం చేసిన తప్పునకు ప్రజలు ఎందుకు ఇబ్బంది పడాలి అని మంత్రి పొంగులేటి ప్రజలకు క్షమాపణ చెప్పి.. మళ్లీ ప్రజల నుంచే దరఖాస్తులు ఎందుకు తీసుకుంటున్నారు అని నాయకులు నిలదీశారు. రాత్రికి రాత్రే ప్రైవేట్ స్థలాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా పెడతారని ప్రశ్నించారు. మేము 22ఏ నుండి తొలగిస్తాం, మాకిస్తారంటూ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. కూకట్‌పల్లిలో ఒక్కరు కూడా రూపాయి లంచం ఇవ్వరని, ప్రభుత్వ మెడలు వంచి ఆ భూములను 22ఏ నుండి తొలగించేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. 22ఏ బాధితులకు బి.ఆర్.ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తేల్చిచెప్పారు.

**భూముల విక్రయాలు, అప్పుల దందా**

రాష్ట్రంలో ఆర్థిక దివాళాకోరుతనంపై తీవ్ర ఆరోపణలు చేసిన నేతలు.. హెచ్‌యూసీ పరిధిలోని 400 ఎకరాల భూమిని అమ్మాలని చూసినా కుదరకపోవడంతో, బాంబే స్టాక్ మార్కెట్‌లో తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చారని ఆరోపించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 9 వేల ఎకరాలను తాకట్టు పెట్టి, లంచాలు దండుకుంటూ ప్రజాధనాన్ని, భూములను తాకట్టు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు విశ్రమించేది లేదని హెచ్చరించారు.

**దీపావళి బాంబులు.. ప్రజల నెత్తినే!**

గత దీపావళి పండుగ రోజున ప్రతిపక్ష నేతల పై బాంబులు వేస్తామని చెప్పిన మంత్రి పొంగులేటి.. ఇప్పుడు నేరుగా పేద ప్రజల ఆస్తుల పైనే బాంబులు వేశారని విమర్శించారు. పొంగులేటి, ముఖ్యమంత్రికి కేవలం రియల్ ఎస్టేట్ మాత్రమే తెలుసని, కానీ బీఆర్ఎస్‌కు ఉద్యమాలు, పోరాటాలు తెలుసని హితవు పలికారు. కేసీఆర్ పాలన ప్రజల సంక్షేమం చుట్టూ తిరిగితే.. ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలన కేవలం భూముల దందాల చుట్టూనే తిరుగుతోందని దుయ్యబట్టారు.

**ప్రభుత్వం అంటే అండగా ఉండాలి.. గుదిబండ కావద్దు: జయప్రకాశ్ నారాయణ**

లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంటే ప్రజలకు రక్షణగా, అండగా ఉండాలని, అంతేగానీ ప్రజల పాలిట గుదిబండగా మారకూడదని హితవు పలికారు. అన్ని రకాల చట్టపరమైన ఆధారాలు, పత్రాలు ఉన్న భూములను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేర్చుతారని ఆయన నిలదీశారు. అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తూ.. ఇవన్నీ చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

**ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం: ఎమ్మెల్యే మాధవరం**

ప్రజల ఆస్తులను కాపాడేందుకు తాను ప్రాణాలనైనా లెక్కచేయబోనని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. అవసరమైతే బాధితులకు న్యాయం జరిగే వరకు ఆమరణ నిరాహార దీక్షకు దిగేందుకైనా సిద్ధమేనని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూదందాలకు పాల్పడుతున్నారని ఆరోపించిన ఆయన, ప్రజల భూముల విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబీహా గౌసుద్దీన్, పగడాల శిరీషా బాబు రావు, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగా రావుతో పాటు శేర్లింగంపల్లి నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు

- **ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను సరిచూసుకోవాలి**
- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ప్రతినిధి, (ప్రభంజనం):**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు నమూనా-6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం నమూనా-7, వివరాల సవరణ కోసం నమూనా-8ను వినియోగించుకోవాలని సూచించారు. ఆచూకీ లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ, వార్డు సభల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అందులో ఏవైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన ఆధారాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాలతోపాటు అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించనున్నట్లు వెల్లడించారు. అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారి ద్వారా ఓటరుకు లేదా వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేస్తారని పేర్కొన్నారు. నోటీసులో తెలిపిన తేదీ, సమయం, ప్రదేశంలో ఓటరు స్వయంగా విచారణకు హాజరై అవసరమైన అసలు ధ్రువపత్రాలను చూపించాలని సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు సమీప గ్రామ పంచాయతీ భవనం లేదా వార్డు కార్యాలయంలో విచారణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎదుట హాజరై ధ్రువపత్రాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఓటర్ల సేవల అంతర్జాల వేదిక ద్వారా కూడా సంబంధిత పత్రాలను ముందుగానే జతచేయవచ్చని తెలిపారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. 1987 జూలై 1కి ముందు జన్మించిన వారు ఎన్నికల సంఘం గుర్తించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని పేర్కొన్నారు. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లి లేదా తండ్రికి సంబంధించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి అందజేయాలని తెలిపారు. 2004 డిసెంబర్ 2 తరువాత జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లిదండ్రులిద్దరి ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. శాశ్వత నివాస, అటవీ హక్కులు, కుల, జనన ధ్రువపత్రాలు, కుటుంబ నమోదుపత్రం, ప్రభుత్వ భూమి లేదా గృహ కేటాయింపు పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, పదో తరగతి లేదా ఇతర విద్యార్హత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, పింఛను చెల్లింపు ఆదేశ పత్రం, జాతీయ పౌరుల నమోదుపత్రంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, జీవిత బీమా సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. 2002 ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాతో వివరాలు సక్రమంగా అనుసంధానమైన ఓటర్లు అదనపు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆగస్టు 10లోగా గణన పత్రాన్ని సమర్పించని వారు దావాలు, అభ్యంతరాల స్వీకరణ కాలంలో దరఖాస్తు నమూనా-6తోపాటు నిర్ణీత ప్రకటన పత్రాన్ని అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని కలెక్టర్ కోరారు. పేరు నమోదు కాకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సవరణకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియపై సందేహాలు లేదా సమస్యలు ఉంటే దూరవాణి సంప్రదింపుల నమోదు సేవ, జాతీయ ఓటరు సేవల ఫిర్యాదుల అంతర్జాల వేదిక ద్వారా లేదా 1950 ఉచిత సహాయ సంఖ్యను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.

# సర్వే ఆఫ్ ఇండియా ప్లాట్లపై వివాదం

- **సరిహద్దుల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ**
- **కంటైనర్లు పెట్టేందుకు ప్రయత్నం**
- **మా ప్లాట్లకు రక్షణ కల్పించాలంటూ మరోవర్గం ఆందోళన**

**శేరిలింగంపల్లి: ( ప్రభంజనం )**



మాదాపూర్ ఖానామెట్ గ్రామ పరిధిలోని సర్వే ఆఫ్ ఇండియా లేఅవుట్ ప్లాట్ల విషయంలో నెలకొన్న వివాదం ఇప్పట్లో ముగిసేలా లేదు. సర్వే ఆఫ్ ఇండియా లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్లు 494 నుంచి 504 వరకు సర్వే నంబర్ 11/21, ఖానామెట్ గ్రామ పరిధిలో ఉన్నాయని ప్లాట్ యజమానులు జి. ప్రకాశ్‌రెడ్డి, సురేష్ కుమార్ తెలిపారు. కూకట్‌పల్లికి చెందిన కొంతమంది వ్యక్తులు సర్వే నంబర్ 11/37లోని (ఐదు ఎకరాల) స్థలంలో సర్వే ఆఫ్ ఇండియా ప్లాట్లకు హక్కులు ఉన్నాయంటూ వివాదం సృష్టిస్తున్నారని వారు ఆరోపించారు. తమ ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించి రౌడీల సాయంతో దౌర్జన్యంగా కంటైనర్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడంతో గత డిసెంబర్ 25న మాదాపూర్ డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు యజమానులు తెలిపారు. డీసీపీ ఆదేశాల మేరకు మాదాపూర్ సీఐ ద్వారా శేరిలింగంపల్లి ఎమ్మార్వోకు లేఖ రాయగా.. సుమారు ఎనిమిది నెలల అనంతరం ఈ నెల మొదటి వారంలో రెవెన్యూ అధికారులు ఆర్ఐ, సర్వేయర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించి సరిహద్దులను నిర్ణయించినట్లు ప్లాట్ యజమానులు తెలిపారు. 11/20, 11/20, 11/21 సర్వే నంబర్ల పరిధిలోనే తమ ప్లాట్లు వస్తాయని, 11/37 సర్వే నంబర్ తమ ప్లాట్ల పరిధిలోకి రాదని ప్లాన్‌తో సహా రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారని వారు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు సరిహద్దులు స్పష్టం చేసిన నేపథ్యంలో ఇకనైనా తమ ప్లాట్ల వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా, తమకు రక్షణ కల్పించాలని మాదాపూర్ పోలీసులను ప్లాట్ యజమానులు కోరారు. చట్టబద్ధంగా తమ ప్లాట్లకు రక్షణ గోడ నిర్మించుకునేందుకు పోలీసులు సహకరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మత సామరస్యంతో మీలాద్ నబి వేడుకలు సంతోషదాయకం

- **రోడమేస్త్రినగర్**
- **మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**మేడ్చల్ ప్రతినిధి (ప్రభంజనం):**

రోడా మేస్త్రి నగర్ డివిజన్‌లో మిలాద్ ఉన్‌నబీ వేడుకలను ముస్లిం సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యత, మతసామరస్యంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, స్థానిక నాయకులు జహంగీర్, సలీం, రషీద్, షాకీర్ తదితరులతో పాటు ముస్లిం యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## అల్వీన్ కాలనీలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- **పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు డి. అనిల్ రెడ్డి.**

**శేరిలింగంపల్లి: ( ప్రభంజనం )**

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ, ఎన్టీఆర్ నగర్, కేటీఆర్ కాలనీల్లో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకలకు శేరిలింగంపల్లి ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి.అనిల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్లామిక్ చివరి ప్రవక్తయైన మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్రమైన రోజు ఇది అని, మహమ్మద్ ప్రవక్త బోధనలు, మానవత్వం, కరుణ, సోదరభావం వంటి విలువలకు నిదర్శనంగా మిలాద్ ఉన్ నబీ పండుగ జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్, ప్రదీప్ రెడ్డి, రాజు, లడ్డు, కాలనీ వాసులు, టీం అనిల్ రెడ్డి మిత్ర మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరీస్సా చూపిన మార్గంలో నడవాలి

- **కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**కంటోన్మెంట్,(ప్రభంజనం)**

భారతరత్న మదర్ థెరిస్సా 116వ జయంతి సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి చౌరస్తాలో మదర్ థెరీస్సా చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు ఆమె మార్గంలో నడిచి సేవాకార్యక్రమాలలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రేంజిమెంటల్ బజార్ లో ని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద చిన్నారుల తో కలిసి కేక్ కట్ చేశారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళీ ముదిరాజ్, రేమండ్ హార్ ఉడ్, నరేష్, డెంజిల్, ప్రభు, ఆంథోనీ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కీసర సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారి ఎక్కడ?

- **ప్రజావాణి రోజు మాత్రమే అధికారులు ప్రత్యక్ష్యం**
- **మిగితా రోజుల్లో కనబడకుండా పోతున్న వైనం**


**కీసర: ( పభంజనం )**




కీసర సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సమస్యలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం, అధికారుల రాకపోకలపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అధికారి ఎప్పుడు వస్తారు.. ఎప్పుడు వెళ్తారో తెలియదు.. సమస్య ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలపై గతంలోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు అందుబాటులో లేకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యమా?.. పర్యవేక్షణ లోపమా?**

కీసర సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అంతా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఏ అధికారి ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియదు. ఎందుకు రాలేదు అనేందుకు కారణం ఉండదదు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ పై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

- **ముగ్గురు తెలంగాణ యువకుల దుర్మరణం**

**ఫ్లోరిడా: ( ప్రభంజనం )**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని బ్రెవార్డ్ కౌంటీలో ఇంటర్‌స్టేట్ 95 (I95) హైవేపై ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో మృతి చెందిన వారిలో నిజామాబాద్ జిల్లా నవీపేట మండలానికి చెందిన ఎన్. రాహుల్ ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫ్లోరిడా హైవే పెట్రోల్ సమాచారం ప్రకారం.. ఆగస్టు 25న ఉదయం సుమారు 9:49 గంటల సమయంలో పామ్ బే ప్రాంతంలోని I95 హైవే 172వ మైలురాయి సమీపంలో ప్రమాదం జరిగింది. రోడ్డుపై ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి హైవే పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టినట్లు అధికారులు తెలిపారు. ఢీకొన్న అనంతరం వాహనంలో మంటలు చెలరేగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు మృతి చెందినట్లు స్థానిక అధికారులు నిర్ధారించారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఏమిటన్నది ఇంకా దర్యాప్తులో ఉంది.

**మృతుల్లో నిజామాబాద్ యువకుడు రాహుల్**

మృతుల్లో ఒకరిని నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం నారాయణపూర్‌కు చెందిన ఎన్. రాహుల్గా గుర్తించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. హరిబాబు, నాగమణి దంపతుల కుమారుడైన రాహుల్ ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లారు.




# బీజేపీ భారీ పొలిటికల్ రీసెట్!

- **మోదీ శకంలోనే అతిపెద్ద ప్రక్షాళన**
- **పార్లమెంటరీ బోర్డు నుంచి కేబినెట్ వరకు..**
- **కనీవినీ ఎరుగని మార్పుల దిశగా కమలనాథులు!**
- **2027-28 మధ్య అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్**
- **ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలపై ప్రధాన గురి**
- **ఆర్ఎస్ఎస్ నాయకత్వంతో కలిసి మోదీ భారీ ప్రణాళికలు**
- **సీనియర్లకు ఉద్వాసన.. కొత్త ముఖాలకు బాధ్యతలు!**
- **మార్పులకు సమాయత్తం అవుతున్న కాషాయ దళం**

**న్యూఢిల్లీ: ( ప్రభంజనం )**

ముందుచూపు చూస్తున్న బీజేపీ నాయకత్వం కనీవినీ ఎరుగని మార్పులకు సిద్ధమవుతోంది. 20272028 మధ్య కాలంలో 16 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని.. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే అతి భారీ ప్రక్షాళనకు కమలనాథులు కసరత్తు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ అగ్రనాయకత్వంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, పార్టీ సంస్థాగత నిర్మాణంలో ఊహకు అందని మార్పులు ఉంటాయని ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. అనూహ్య రీతిలో భారీగా కొత్తవారి చేరికలు, సీనియర్లకు ఉద్వాసనలు ఉండొచ్చని ఢిల్లీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 2027లోనే గుజరాత్, ఉత్తరప్రదేశ్ సహా 5 కీలక రాష్ట్రాల్లో అధికారాన్ని నిలబెట్టుకోవాలే పట్టుదల, మరోవైపు పంజాబ్‌లో ఆప్‌ని, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను గద్దె దించాలనే లక్ష్యంతో బీజేపీ భారీ సంస్కరణలకు తక్షణ లక్ష్యంగా ఉంది.

**మార్పులతో ప్రతికూల సంకేతాలకు చెక్**

బీజేపీకి క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇదివరకు ఉన్నంత సాఫీగా లేవనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. యువతతో పాటు పలు వర్గాల ఓటర్లలో కనిపిస్తున్న అసంతృప్తి, మరోవైపు, ధరల పెరుగుదల అంశాలు ప్రతికూలమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్ద కాలంగా నడిచిన 'హిందూత్వ వేవ్' కూడా తగ్గిందనే అంచనాలున్నాయి. ఇన్ని సవాళ్లను చిన్నచిన్న మార్పులతో అధిగమించలేమని బీజేపీ అధిష్టానం లెక్కలు వేస్తోంది. బలమైన రాజకీయ, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం, పార్టీ రూపురేఖలను మార్చే ఒక 'పొలిటికల్ రీసెట్' అత్యవసరమని బీజేపీ సీనియర్ నాయకుడు అభిప్రాయపడ్డారు. మోదీ 3.0 ప్రభుత్వం దాదాపు 27 నెలల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ఇకపై బలహీనమైన నిర్ణయాలతో కాలయాపన చేసే పరిస్థితి లేదని చెప్పారు.

**పార్లమెంటరీ బోర్డులో అనూహ్య మార్పులు?**

ప్రధానమంత్రి అభ్యర్థి సైతం నిర్ణయించే బీజేపీ అత్యున్నత విభాగం పార్లమెంటరీ బోర్డులో ఊహకందన మార్పులు ఉండబోతున్నాయనే కథనాలు వెలువడుతున్నాయి. ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్ పదవికి ముప్పు లేకపోవచ్చు. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కూడా కొనసాగనున్నారు. దీంతో మిగిలిన 7 స్థానాలపైనే ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానాల్లో ప్రస్తుతం ఉన్న నడ్డా, యడియూరప్ప, సర్బానంద సోనోవాల్, కె. లక్ష్మణ్, ఇక్బాల్ సింగ్ లాల్‌పురా, సుధా యాదవ్, సత్యనారాయణ విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది ఆసక్తిని రేపుతోంది. బోర్డులోకి కొత్తగా సీఎంలు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడ్నవీస్‌లను తీసుకుంటారనే ప్రచారం నడుస్తోంది. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రమంత్రి మండలిలో కూడా అనూహ్య మార్పులు ఉండబోతున్నట్టు పార్టీ వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి.

## బ్రో, వెయిట్.. రాహుల్‌పై
# కంగనా సెటైర్లు





- **నటి కృతి సనన్ ప్రతిపక్ష నేత రాహుల్ మద్దతు**
- **రాహుల్ గాంధీకి బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ విమర్శలు**

**న్యూఢిల్లీ: ( ప్రభంజనం )**

బాలీవుడ్ నటి కృతి సనన్ రక్షాబంధన్ యాడ్‌లో ధరించి దుస్తులపై మొదలైన వివాదం రాజకీయ రంగానికి పాకింది. మోడ్రన్ డ్రెస్‌లో శునకానికి రాఖీ కట్టడంపై ట్రోలింగ్‌ను ఖండిస్తూ, కృతి సనన్‌కు మద్దతు పలికిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ విమర్శలు గుప్పించారు. స్వేచ్ఛగా జీవించే మహిళల్ని ట్రోలింగ్ చేయవద్దంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్లు ఇచ్చారు. బీజేపీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన కార్టూల సిరీస్‌ను 'బ్రో, వెయిట్.. ఇక మొదలుపెడదాం' అంటూ కంగనా షేర్ చేశారు. ఆ కార్టూన్ ఇలస్ట్రేషన్‌లో రాహుల్ గాంధీతో ఓ యువతి సంభాషణ జరిపినట్టుగా ఉంది. బీజేపీ విడుదల చేసిన ఈ కార్టూన్ల ద్వారా కాంగ్రెస్ పార్టీ మహిళా విధానాలను, గతాన్ని యువతి ప్రశ్నిస్తున్నట్టుగా చిత్రీకరించారు. పితృస్వామ్యం, ట్రిపుల్ తలాక్‌లపై ప్రశ్నించగా, అవి ఓటు బ్యాంక్ రాజకీయమని కాంగ్రెస్ అగ్రనేత సమాధానం ఇస్తున్నట్టు చిత్రీకరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించడాన్ని ప్రశ్నించగా, అది కూడా ఓటు బ్యాంక్ గేమ్ అని బదులిచ్చినట్లు వ్యంగ్యంగా చిత్రీకరించారు. స్వేచ్ఛ గురించి మాట్లాడే వారు 'షా బానో కేసు సంగతి ఏంటి?' అని ప్రశ్నించినట్టు ఇలస్ట్రేషన్‌ను రూపొందించారు. చివరిగా కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 33 మంది మంత్రులు ఉండగా ఒక్క మహిళ కూడా ఎందుకు లేరు? అని అడిగిన ప్రశ్నకు రాహుల్ సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్టు చిత్రించారు.

**అసలేంటి వివాదం?**

ఒక ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ కోసం నటి కృతి సనన్ 36 సెకన్ల నిడివి ఉన్న రక్షాబంధన్ యాడ్‌లో నటించారు. ఆ వీడియోలో ఆమె ఇండోవెస్ట్రన్ డ్రెస్‌లో కనిపించారు. తన సోదరుడికి, అలాగే తన పెంపుడు శునకానికి రాఖీ కట్టారు. అయితే, భారతీయ సంస్కృతికి, రక్షాబంధన్ పండుగకు తగినట్లు కృతి సనన్ దుస్తులు లేవంటూ సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేశారు. ఇంట్లోని అల్మారాల్లో ఎన్నో రకాల దుస్తులు అందుబాటులో ఉండగా ఇలాంటి దుస్తుల్లోనే రాఖీ కట్టడం ఎందుకు? అని ప్రశ్నించారు. దీనికి, కృతి సనన్ కూడా ధీటుగా బదులివ్వగా.. రాహుల్ గాంధీ మద్దతుగా నిలిచారు.

## మంగళగిరిలో రూ.18 కోట్లతో
# మోడల్ రైతు బజార్



- **నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్**

**మంగళగిరి: ( ప్రభంజనం )**

మంగళగిరి నియోజకవర్గంలో మరో భారీ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు మంత్రి నారా లోకేష్. ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిడమర్రు రైల్వే గేట్ వద్ద ఆధునిక హంగులతో మోడల్ రైతు బజార్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ రిటైల్, హోల్‌సేల్ వెజిటబుల్ మార్కెట్ నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం 5.90 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.18 కోట్ల వ్యయంతో ఈ మోడల్ రైతు బజార్‌ను నిర్మించనున్నారు. అరబిందో ఫార్మా ట్రస్ట్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తోంది. సుమారు 72,000 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంలో మార్కెట్‌ను రైతులు, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దనున్నారు. రిటైల్, హోల్‌సేల్ విభాగాలు సమీకృత మార్కెట్‌లో రిటైల్, హోల్‌సేల్ విక్రయాలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. రిటైల్ మార్కెట్‌లో కూరగాయల విక్రయానికి 102 స్టాళ్లు, పండ్లు, పూలకు 54 ప్రత్యేక స్టాళ్లు కేటాయించనున్నారు. ఇతర వస్తువుల విక్రయానికి మరో 60 షాపులు ఏర్పాటు చేయనున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లు, 23 కూరగాయల దుకాణాలను నిర్మించనున్నారు. రైతులు తమ ఉత్పత్తులను సులభంగా విక్రయించుకునేలా, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందుబాటులో ఉండేలా మార్కెట్‌ను రూపొందించనున్నారు.

**అత్యాధునిక సదుపాయాలు**

మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు శుభ్రపరిచే ప్రాంతం, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, క్యాంటీన్, ప్రజల కోసం మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పించనున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలంతో పాటు వాటర్ సంప్, ఓవర్‌హెడ్ ట్యాంక్, జనరేటర్, సేంద్రియ వ్యర్థాల కన్వర్టర్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా టెర్రస్‌పై సోలార్ ఎనర్జీ ప్యానెళ్లను ఏర్పాటు చేసి పర్యావరణహితంగా మార్కెట్‌ను తీర్చిదిద్దనున్నారు. ఈ మోడల్ రైతు బజార్ నిర్మాణం పూర్తయితే మంగళగిరితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.

# మహిళలకు ఏటా .. రూ.40 వేల ఆర్థిక సాయం

- **ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కీలక హామీలు**
- **యూపీ ఎన్నికల్లో హామీల హోరు.. మహిళా ఓటర్ల కోసం బీజేపీ, ఎస్పీ సర్వశక్తులు**
- **విద్య, ఉపాధి రంగాలే అస్త్రంగా యూపీలో రాజకీయ పార్టీల హామీల ప్రవాహం**

**ఉత్తరప్రదేశ్, (ప్రభంజనం):**



అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడటంతో ఉత్తరప్రదేశ్‌లో అధికార బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీల మధ్య హామీల పోరు తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రంలో మూడోసారి పీఠాన్ని దక్కించుకోవాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యూహాలు రచిస్తున్నారు. మరోవైపు ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ వ్యూహ రచన చేస్తోంది. ఈ క్రమంలో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎస్పీ హామీలు గుప్పిస్తోంది. యోగి ఆదిత్యనాథ్ మహిళల సంక్షేమం కోసం ఇప్పటికే కీలక ప్రకటనలు చేశారు. 60 ఏళ్లు దాటిన మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. అంతేకాదు 12వ తరగతి పూర్తయిన 25 లక్షల మంది బాలికలకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందిస్తామని ప్రకటించారు. వీటితోపాటు 'రాణి లక్ష్మీబాయి పథకం' ద్వారా విద్యార్థినులకు 50 వేల ఉచిత స్కూటీలను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. మరోవైపు అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తూ అఖిలేశ్ యాదవ్ 'స్త్రీ సమ్మాన్ సమృద్ధి యోజన' వేదికగా 10 భారీ హామీలతో ముందుకు వచ్చారు. పేద మహిళలకు ఏటా రూ.40 వేలు ఆర్థిక సాయం అందించడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఈ మొత్తాన్ని పెంచుతామని మాటిచ్చారు. ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ప్రతి నెలా రెండు రోజుల ప్రత్యేక సాధారణ సెలవులు, వితంతువులు, నిరుపేదలకు శాశ్వత గృహాల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. విద్యా రంగానికి సంబంధించి 12వ తరగతి బాలికలకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి ఫీజు మాఫీ, ప్రైవేట్ బడుల్లో సగం ఫీజు భరిస్తామని తెలిపారు. ప్రతి తహసీల్‌లో పీజీ కళాశాల, జిల్లాకో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంతోపాటు, మూతపడిన 26 వేల పాఠశాలలను తిరిగి తెరిపిస్తామని, మహిళలపై నేరాల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను నెలకొల్పుతామని వెల్లడించారు.

# 77 మంది ఆచూకీ తెలియడం లేదు

**న్యూఢిల్లీ:**

టిబెట్‌లోని గిరోంగ్ పట్టణంలో భారీ ఆకస్మిక వరద సంభవించినపుడు తన కైలాస యాత్ర బృందాలలో ఒకదానికి చెందిన 77 మంది యాత్రికులు అక్కడి ఇమిగ్రేషన్ కేంద్రంలో ఉన్నారని ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీవాసుదేవ్ బుధవారం తెలిపారు. డాక్టర్ అఖిలేశ్వర్ నేతృత్వంలో కైలాస యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న ఆ బృందం ఇమిగ్రేషన్ కార్యాలయం వద్ద ఆగి ఉన్న సమయంలో ఈ వరద ముంచెత్తి ఆ భవనాన్ని, పట్టణంలోని అనేక ప్రాంతాలను ముంచెత్తినట్టు ఆయన తెలిపారు. అక్కడ చిక్కుకున్న యాత్రికుల ఆచూకీకి సంబంధించి ఎటువంటి అధికారిక సమాచారం లేదని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. కైలాస యాత్రలో పాల్గొన్న 21 బృందాలకు చెందిన యాత్రికుల వివరాలను తెలియచేస్తూ 495 మంది ఇప్పటికే సురక్షితంగా తిరిగి వచ్చారని సద్గురు తెలిపారు.




# నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం హెల్ప్‌లైన్

- **నేపాల్ వరద పరిస్థితిపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ**

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):**

నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. నేపాల్ పరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాలతో తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమన్వయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎంఈఏ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయంతో తెలంగాణ భవన్ అధికారుల సమన్వయం చేసుకుంటున్నారు. నేపాల్‌లో ఉన్న తెలంగాణ యాత్రికులు, పర్యాటకుల కుటుంబ సభ్యులు హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చు. బాధితుల పేరు, పాస్‌పోర్ట్, మొబైల్, నేపాల్‌లోని ప్రాంత వివరాలు అందించాలని తెలంగాణ ప్రభుత్వం సూచించింది. ట్రావెల్/టూర్ ఆపరేటర్, కుటుంబ సభ్యుల సంప్రదింపు వివరాలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం సూచించింది. అందిన విజ్ఞప్తులను ప్రాధాన్యతా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వానికి, భారత రాయబార కార్యాలయానికి చేరవేయనుంది. తెలంగాణ భవన్ హెల్ప్‌లైన్ నంబర్లు: 9871999044, 9949351270, 9618597969.

# అమెరికా వీసా అపాయింట్మెంట్ల నిలిపివేత

- **అంతర్జాతీయంగా ఆగిపోయిన ప్రక్రియ**
- **కాన్సులర్ అధికారులకు ట్రైనింగ్ పేరిట నిలిపివేత**

**వాషింగ్టన్: ( ప్రభంజనం )**




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలోని ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ విధానాలను మరింత కఠినతరం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ ఎంబసీలు, కాన్సులేట్లలో ఇమ్మిగ్రెంట్ వీసా అపాయింట్మెంట్లను యూఎస్ విదేశాంగ శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. కొన్నింటిని రీషెడ్యూల్ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ దౌత్య కార్యాలయాల్లోని కాన్సులర్ అధికారులకు ఒక ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చేందుకే ఈ అపాయింట్మెంట్ సర్వీసులను సర్దుబాటు చేస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉన్న వీసా దరఖాస్తుదారులను ముందుగానే గుర్తించి, నిరోధించడమే ఈ ట్రైనింగ్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. వీసా అప్లికెంట్ల అర్హతలను అత్యంత సమగ్రంగా, నిలకడగా సమీక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ విదేశాంగ శాఖ ప్రకటించింది. అయితే, ఈ శిక్షణ ప్రక్రియ ఎన్నాళ్లు కొనసాగుతుంది, వీసా సేవలు ఎప్పుడు పునఃప్రారంభమవుతాయనే దానిపై నిర్దిష్ట గడువును వెల్లడించలేదు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు ఖరారైన ఇమ్మిగ్రెంట్ వీసా దరఖాస్తుదారులకు అపాయింట్మెంట్లు రీషెడ్యూల్ అయినట్టుగా అమెరికా ఎంబసీల నుంచి ఈమెయిళ్లు వెళ్తున్నాయి. కొత్త తేదీల వివరాలను తెలియజేస్తామని సమాచారం ఇస్తున్నారు.

**ఇమ్మిగ్రేషన్‌పై ట్రంప్ కఠిన వైఖరి**

ట్రంప్ ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్‌పై తీవ్రమైన ఆంక్షలు విధించడాన్ని కొనసాగిస్తోంది. భారతీయ ఐటీ నిపుణులకు కీలకమైన హెచ్1బీ వీసా నిబంధనలను భారీగా మార్చివేసేందుకు సంబంధించిన ఒక కొత్త ప్రతిపాదనను ఇప్పటికే వైట్ హౌస్ సమీక్షిస్తోంది. మరోవైపు, టూరిజం లేదా బిజినెస్ వీసాలపై అమెరికాకు వచ్చి, నిర్ణీత గడువు ముగిసిన తర్వాత కూడా అక్కడే ఉండటానికి అసిలమ్ (ఆశ్రయం) కోరుతూ దరఖాస్తు చేసుకున్న సుమారు 2 లక్షల మంది విదేశీయుల వీసాలను రద్దు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అమెరికా అంతర్గత భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రంప్ చెబుతోంది. అయితే, కొన్ని నిర్ణయాలకు న్యాయస్థానాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

# 8.25% పట్టభద్రులకే అర్హతకు తగ్గ ఉద్యోగాలు

**న్యూఢిల్లీ:**


దేశంలో నైపుణ్య శిక్షణ వ్యవస్థను సవరించేందుకు కొత్తగా ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పట్టభద్రులలో నిరుద్యోగిత జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా ఉందని నీతి ఆయోగ్ గుర్తించింది. సాధారణంగా ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలను పెద్దగా కల్పించని బీఏ, బీఎస్సీ, బీకాం వంటి డిగ్రీలపై అధికంగా ఆధారపడటం ఈ సమస్యకు ఒక కారణంగా నిలుస్తున్నదని నీతి ఆయోగ్ పేర్కొంది. హరిత పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి అధిక వృద్ధి రంగాలలో ప్రత్యేకమైన, ఉద్యోగానుసంధాన కార్యక్రమాల వైపు పయనించాలని, అలాగే అప్రెంటిస్‌షిప్‌లపై మరింత దృష్టిపెట్టాలని పేర్కొంటూ భారత్‌లో 90 శాతానికి పైగా పట్టభద్రులు వారి అర్హతలకు అనుగుణంగా లేని ఉద్యోగాలలో నిమగ్నమై ఉన్నారని నీతి ఆయోగ్ తెలిపింది. దేశంలోని ఉన్నత సాంకేతిక విద్యా వ్యవస్థలో బోధించే విషయాలకూ, కార్మిక మార్కెట్ డిమాండ్ చేసే వాటికి మధ్య ఒక ప్రాథమిక అంతరం ఉంది. చాలా సంస్థల్లోని పాఠ్యప్రణాళికలకు కాలం చెల్లిపోయి అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా లేవు.


# మార్ఫ్ చేశారు!

హీరోయిన్ కంగనా రనౌత్ కి బాలీవుడ్ లో మంచి క్రేజ్ ఉంది. ఐతే కంగనా రనౌత్ రీసెంట్ గా మీడియాతో మాట్లాడుతూ.. 'యూత్ ఎక్కువగా సోషల్ మీడియాలోనే ఉంటుంది. కానీ, సోషల్ మీడియా అంటేనే నెగిటివిటీ అయిపోయింది. అమ్మాయిల ఫొటోలను మార్ఫ్ చేస్తూ ఆనందిస్తున్నారు. అంతెందుకు నా ఫోటోలను కూడా మార్ఫ్ చేశారు. పైగా నన్ను ట్రోల్ చేసి ఆనందించే వారు. ఇలాంటి వారి వల్ల యువకులు కూడా చెడిపోతున్నారు. అందుకే, యూత్ ఆలోచనా విధానం మారాలి' అంటూ కంగనా తెలిపింది. కంగనా ఇంకా మాట్లాడుతూ.. 'వయసులో ఆవేశం ఉంటుంది. ఆ ఆవేశం మంచి వైపు సాగితే జీవితం బాగుంటుంది. లేదు అంటే.. జీవితాంతం బాధ పడాల్సి వస్తోంది. యూత్ దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి. నేను ఇలాంటి కామెంట్స్ చేయడం కూడా చాలామందికి నచ్చదు. ఈమె నీతులు చెబుతుంది ఏంటి ? అన్నట్టు చూస్తారు. అయినా, నటిగా నా వృత్తికి తగ్గట్లుగా అనేక పాత్రల్లో నటిస్తాను. అవి నేను కాదు, పాత్రలు మాత్రమే' అంటూ కంగనా కామెంట్స్ చేసింది.



# 'పంజా' మేనియా మరోసారి షురూ!





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన పలు ఐకాన్ సినిమాల్లో దర్శకుడు విష్ణు వర్ధన్ తో చేసిన స్టైలిష్ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామా 'పంజా' కూడా ఒకటి. 2011 లో ఎన్నో అంచనాలు నడుమ వచ్చిన ఈ చిత్రం డిజాస్టర్ గానే నిలిచింది. అప్పట్లో పవన్ ఎన్నో ఫ్లాప్స్ లో ఉన్నప్పటికీ ఈ సినిమా సృష్టించిన యుఫోరియా అంతా ఇంతా కాదు. మరి మళ్ళీ ఇన్నాళ్ల తర్వాత పంజా మేనియా మళ్ళీ అభిమానుల్లో కనిపిస్తుంది. ఈసారి పవన్ కళ్యాణ్ పుట్టినరోజుకి ప్లాన్ చేసిన ఈ రీరిలీజ్ తాలూకా బుకింగ్ లేటెస్ట్ గా మొదలయ్యాయి. ఇంట్రెస్టింగ్ గా ఈ సినిమా కేవలం నాలుగే షోస్ ఓపెన్ అయితే ఈ నాలుగు షోస్ తోనే బుక్ మై షోలో ట్రెండింగ్ కి వచ్చేసింది. ఇక ప్రస్తుతం గంటకి 2 వేల 700 టికెట్స్ కి పైగా ట్రెండింగ్ లోకి వచ్చేసింది. ఇదంతా ఓ డిజాస్టర్ సినిమాకి కావడం గమనార్హం. మరి ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ నాటికి ఈ సినిమా ఎలాంటి నంబర్స్ సెట్ చేస్తుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించగా ఆర్కా మీడియా సంస్థ నిర్మాణం వహించారు.

# రవితేజకు తెలియకుండానే జరిగిందా?



రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్' తెలుగులో విడుదలవడమేమో కానీ 'ఇరుముడి'ని సైడ్ చేశారంటూ పెద్ద ఎత్తున రచ్చ జరుగుతోంది. 'టాక్సిక్'కు పెద్ద ఎత్తున థియేటర్లు చేటాయించారని.. దాని వలన 'ఇరుముడి'కి అన్యాయం జరుగుతోందని నెటిజన్లు పెద్ద ఎత్తున పోస్టులు పెడుతున్నారు. అదంతా ఒక ఎత్తైతే.. దీని వెనుక పెద్దగా ఎవరికీ తెలియని ఆసక్తికర విషయం కూడా మరొకటి ఉంది. వాస్తవానికి ఏ కొత్త సినిమా.. అందునా భారీ బడ్జెట్, పాన్ ఇండియా, బాగా హైప్ క్రియేట్ అయిన చిత్రం వస్తోందంటే.. సర్వసాధారణంగానే థియేటర్లు కేటాయించడం జరుగుతుంది. 'టాక్సిక్' విషయంలోనూ ఇదే జరిగింది. ఇక ఆసక్తికర విషయం ఏంటంటే.. రవితేజ సొంత థియేటర్ అయిన 'ఏఆర్‌టీ సినిమాస్'లోనూ బుధవారం 'ఇరుముడి'కి ఏడు స్క్రీన్‌లు కేటాయించగా.. 'టాక్సిక్'కు 12 షోలు కేటాయించారు. రవితేజకు తెలియకుండానే ఆయన సినిమాకు.. ఆయన థియేటర్‌లో స్క్రీన్‌లను తగ్గించి.. టాక్సిక్‌కు కేటాయించి ఉంటారా? తెలియకుండా అయితే జరగదు. దీనిని బట్టి చూస్తే సినిమా సినిమానే.. వ్యాపారం వ్యాపారమే. రెండింటికీ ముడి పెట్టడానికి లేదు. ప్రస్తుతం 'టాక్సిక్'కు అయితే టాక్ ఆశాజనకంగా ఏమీ లేదు. దీంతో తిరిగి 'ఇరుముడి'కి థియేటర్స్ ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికీ 'ఇరుముడి'కి అయితే పోటీయే లేదు. ఈ చిత్రం విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. ఇక ఈవారం కూడా పెద్దగా సినిమాలేమీ లేవు.



# ఒక్కరోజు కూడా షూటింగ్‌కి వెళ్లలే..

బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. తాజాగా "రోమాంచకం" చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. చిత్ర సమర్పకులు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ "నేను రోమాంచకం సినిమా చూశాను. చాలా బాగుంది. ఈ సినిమాలో హీరో క్యారెక్టరైజేషన్ ఇన్నోసెంట్‌గా ఉంటుంది. అలాంటి క్యారెక్టర్‌లో పర్‌ఫార్మ్ చేసి మెప్పించడం కష్టం. హీరో, హీరోయిన్, వారి స్నేహితుల క్యారెక్టర్స్ చూస్తుంటే సినిమాలా అనిపించదు. పక్క నుండి వీళ్లను చూస్తున్నట్లు అనిపిస్తుంటుంది. నేను కథ విన్నాను, ఫస్ట్ కట్ చూశాను. అంతే ఒక్క రోజు కూడా షూటింగ్‌కు వెళ్లలేదు, వాళ్లను డిస్ట్రబ్ చేయలేదు. నాకు మైక్రో మేనేజ్‌మెంట్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. అందుకే వాళ్లను డిస్ట్రబ్ చేస్తానని షూటింగ్‌కు వెళ్లలేదు. కథ విన్నప్పుడు నేను ఎంతగా నవ్వుకున్నానో, సినిమా చూశాక అంతకంటే ఎక్కువ నవ్వాను" అన్నారు. హీరో కార్యక్రమంలో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ.. "రోమాంచకం క్యూట్ లవ్ ఫిలిం. యాక్టర్‌గా ఓపెన్ అప్ అయిపోయి నటించే అందరినీ నవ్వించే అందరూ ఇష్టపడే ఇలాంటి బ్యూటిఫుల్ క్యారెక్టర్‌లో నటించే అవకాశం నాకు కల్పించిన మా డైరెక్టర్ వేణు అన్నకు కృతజ్ఞతలు. అనంతిక మంచి పర్ ఫార్మర్, ఏ విద్య నేర్చుకోమన్నా త్వరగా నేర్చుకుంటుంది.

ప్రభంజనం
09 | 27.08.2026
గురువారం, హైదరాబాద్
/prabanjanam
SPORTS news




## రీఎంట్రీకి సిద్ధమవుతున్న వైట్‌బాల్ స్టార్స్

స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం): టీమిండియా అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్, శ్రీలంక జట్ల మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ-ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. బెంగళూరులోని వర్కౌట్స్, ట్రైనింగ్ సెషన్లకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన గాయం నుంచి వేగంగా కోలుకుంటూ పునరావాస శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్విపాక్షిక సిరీస్‌లపైనే ఉంది.

## యువ ఆటగాళ్ల దూకుడుకు బ్రేక్ వేయాల్సిందే..



స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం): టీమిండియా యువ ఆటగాళ్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ పట్ల బీసీసీఐ, ఐసీసీ కఠినంగా వ్యవహరించాలని మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ అన్నాడు. అలా చేస్తేనే క్రికెట్‌తో పాటు కుర్రాళ్లకూ మంచిదని వ్యాఖ్యానించాడు. శ్రీలంక పర్యటనలో ఈ ఇద్దరూ ఆటగాళ్లు ఐసీసీ నిబంధనలు ఉల్లంఘించారు. భారత్-ఏ తరపున వైభవ్ సూర్యవంశీ.. టెస్ట్ సిరీస్‌లో యశస్వి జైస్వాల్ ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవపడ్డారు. ఈ ఘటనల్లో వైభవ్‌పై చర్యలు తీసుకోలేదని, కానీ యశస్వి జైస్వాల్‌కు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానాతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ పడింది. తాజాగా ఈ ఇద్దరి గొడవలను ప్రస్తావించిన సంజయ్ మంజ్రేకర్.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డాడు. 'భారత్-ఏకు ఆడుతున్నప్పుడు వైభవ్ సూర్యవంశీ.. తాజా టెస్ట్ సిరీస్‌లో యశస్వి జైస్వాల్ ప్రవర్తన అస్సలు బాగోలేదు. ఐసీసీ, బీసీసీఐ వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే.. అలాంటి ప్రవర్తనను పునరావృతం చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే అవుతుంది. ఇది ఆటకు మంచి కాదు. అలాగే యువ క్రికెటర్ల భవిష్యత్తుకు ప్రమాదకరం.'అని సంజయ్ మంజ్రేకర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు.

# ఏషియన్ గేమ్స్ 2026 షెడ్యూల్ విడుదల

## సెప్టెంబర్ 17 నుంచి సమరం.. అక్టోబర్ 3న ఫైనల్ మ్యాచ్

- **పురుషుల విభాగంలో 10, మహిళల విభాగంలో 8 జట్ల మధ్య ఫైట్**
- **భారత్, పాక్ తమ మ్యాచ్‌ల్లో గెలిస్తే అక్టోబర్ 1న సెమీస్‌లో అవకాశం**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**



ఏషియన్ గేమ్స్ 2026లో క్రికెట్ పోటీల షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 3 వరకు ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. పురుషుల విభాగంలో 10 జట్లు.. మహిళల విభాగంలో 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. పురుషుల విభాగం విషయానికొస్తే.. గ్రూప్ ఏలో ఆఫ్ఘనిస్తాన్, జపాన్, నేపాల్ జట్లు.. గ్రూప్ బిలో హాంగ్‌కాంగ్‌చైనా, మలేషియా, ఒమన్ జట్లు పోటీపడనున్నాయి. సీడెడ్ జట్లైన భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. భారత్, పాకిస్తాన్ జట్లు తమ తమ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో గెలుపొందితే అక్టోబర్ 1న జరిగే సెమీఫైనల్లో తలపడే అవకాశం ఉంది.

**పురుషుల క్రికెట్ షెడ్యూల్**

**క్వాలిఫయర్స్**

- సెప్టెంబర్ 24 ఆఫ్ఘనిస్తాన్ వర్సెస్ జపాన్
- హాంకాంగ్‌చైనా వర్సెస్ మలేషియా
- సెప్టెంబర్ 25 హాంకాంగ్‌చైనా వర్సెస్ ఒమన్
- ఆఫ్ఘనిస్తాన్ వర్సెస్ నేపాల్
- సెప్టెంబర్ 26 జపాన్ వర్సెస్ నేపాల్
- మలేషియా వర్సెస్ ఒమన్

**క్వార్టర్‌ఫైనల్స్**

- సెప్టెంబర్ 28 (తొలి క్వార్టర్ ఫైనల్) పాకిస్తాన్ వర్సెస్ గ్రూప్‌బిలో రెండో స్థానంలో నిలిచే జట్టు
- సెప్టెంబర్ 28 (రెండో క్వార్టర్ ఫైనల్) భారత్ వర్సెస్ గ్రూప్‌ఏలో రెండో స్థానంలో నిలిచే జట్టు
- సెప్టెంబర్ 29 (మూడో క్వార్టర్ ఫైనల్) శ్రీలంక వర్సెస్ గ్రూప్‌ఏ విన్నర్
- సెప్టెంబర్ 29 (నాలుగో క్వార్టర్ ఫైనల్) బంగ్లాదేశ్ వర్సెస్ గ్రూప్‌బి విన్నర్
- అక్టోబర్ 1 సెమీఫైనల్స్

**అక్టోబర్ 3- కాంస్య పతక మ్యాచ్, ఫైనల్**

- మహిళల విభాగం విషయానికొస్తే..భారత్, జపాన్, బంగ్లాదేశ్, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఒక గ్రూపులో.. పాకిస్తాన్, శ్రీలంక, మలేషియా, థాయ్‌లాండ్ మరో గ్రూప్‌లో ఉన్నాయి. ఈ పోటీలు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌తో మొదలవుతాయి.
- సెప్టెంబర్ 17 క్వార్టర్ ఫైనల్ 1 బంగ్లాదేశ్ వర్సెస్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా
- క్వార్టర్ ఫైనల్ 2 పాకిస్తాన్ వర్సెస్ థాయ్‌లాండ్
- సెప్టెంబర్ 18 క్వార్టర్ ఫైనల్ 3 శ్రీలంక వర్సెస్ మలేషియా
- క్వార్టర్ ఫైనల్ 4 భారత్ వర్సెస్ జపాన్
- సెప్టెంబర్ 20 సెమీఫైనల్స్ (1,2)
- సెప్టెంబర్ 22 కాంస్య పతకం మ్యాచ్, ఫైనల్స్

# టాప్ లేపేసిన స్టార్క్..

- **ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నెం.1 బౌలర్‌గా ఆసీస్ పేసర్**
- **బుమ్రాను దాటేసి నెంబర్ వన్ స్థానాన్ని కొల్లగొట్టిన మిచెల్ స్టార్క్**
- **టాప్ 10 లోకి దూసుకొచ్చిన రిషబ్ పంత్**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ దుమ్మురేపాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను వెనక్కి నెట్టి మిచెల్ స్టార్క్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మిచెల్ స్టార్క్ 872 పాయింట్లతో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా(862), మ్యాట్ హెన్రీ(861) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్(807) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా(862), మ్యాట్ హెన్రీ(861) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్(807) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో నిలిచాడు.

**రెండు స్థానాలు ఎగబాకి..**

బంగ్లాదేశ్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్ట్‌ల సిరీస్‌లో మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగాడు. రెండో టెస్ట్‌లో 10 వికెట్లు పడగొట్టిన స్టార్క్.. రెండు స్థానాలు ఎగబాకి బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ అద్భుత ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఫస్ట్ బాల్‌కే మిచెల్ స్టార్క్ వికెట్ పడగొట్టాడు. బ్యాటింగ్ విభాగంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఈ ఇద్దరూ మెరుగైన ప్రదర్శన చేశారు. రెండో టెస్ట్‌లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ తృటిలో శతకాన్ని చేజార్చుకున్న సంగతి తెలిసిందే.

**టాప్-10లోకి వచ్చిన పంత్..**

ఈ ప్రదర్శనతో రిషభ్ పంత్(711) ఆరు స్థానాలు ఎగబాకి టాప్10లోకి వచ్చి 8వ ర్యాంకు అందుకోగా.. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని 30వ స్థానంలో నిలిచాడు. మరోవైపు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన శుభ్‌మన్ గిల్(711)8వ స్థానానికి పడిపోయాడు. రెండు టెస్ట్‌ల్లో విఫలమైన యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్(874), జో రూట్(850), స్టీవ్ స్మిత్(840), ట్రావిస్ హెడ్(811), టెంబా బవుమా(775) టాప్ 5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా(428)తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు.






# ఫాలో ఆన్‌లో శ్రీలంక విలవిల

- **శ్రీలంకతో రెండో టెస్ట్‌లో గెలుపుకు టీమిండియా చేరువ**
- **గెలుపుకు కేవలం 4 వికెట్ల దూరంలో టీమిండియా**
- **లంకపై టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్‌కు సిద్ధమైన గిల్ సేన**
- **బౌలర్ల ధమాకా.. ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్‌లకు తలో 3 వికెట్లు**




**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది.

**290 పరుగులకు కుప్పకూలిన శ్రీలంక**

అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు.

**ప్రమాదకరంగా మారిన ఆ జోడీని..**

సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు.

# ముంబై వేదికగా బీసీసీఐ ఎన్నికలు

- **సెప్టెంబర్ 18న తేలనున్న నూతన వర్గం**
- **ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పనితీరుపై సమీక్ష జరిగే అవకాశం**
- **చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడిగింపుపై ఉత్కంఠ**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**




భారత క్రికెట్ బోర్డు వార్షిక సర్వసభ్య సమావేశం ముంబయి వేదికగా సెప్టెంబర్ 18న జరగనుంది. బీసీసీఐ ఎన్నికలు కూడా అదే రోజున నిర్వహించనున్నారు. రెండు ప్రధాన అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నట్లు సమాచారం. అలాగే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పనితీరుపై విశ్లేషణ చేస్తుందో లేదో చూడాలి. మరోవైపు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడింగిపుపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బీసీసీఐ ఇప్పటికే సభ్యులకు నోటిఫికేషన్‌ను పంపింది. ఎన్నికల ఓటర్ల జాబితాలో చేర్చాల్సిన తమ ప్రతినిధులను ఎంపిక చేసుకోవాలని సూచించింది. అందుకోసం ఆగస్టు 31 వరకు గడువు ఉంది. ఓటర్ల జాబితా ముసాయిదాను సెప్టెంబర్ 1న రిలీజ్ చేయనుంది. సభ్యులుగా ఎన్నికయ్యేందుకు నామినేషన్లను సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో దాఖలు చేయాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 12న అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతోపాటు ఆ రోజే ఎన్నికలు జరుగుతాయి. సెప్టెంబర్ 18న ఫలితాలు వెల్లడవుతాయి.

ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిలింగ్‌లోకి కొత్తగా ప్రతినిధులను తీసుకోవడంపై వార్షిక సమావేశంలో బీసీసీఐ నిర్ణయం తీసుకోనుంది. ఇద్దరిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఐసీసీలో భారత్ తరఫున ప్రతినిధిగా ఎవరిని నియమించాలనే దానిపైనా చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ఐసీసీ ఛైర్మన్‌గా భారత్‌కు చెందిన జైషా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. మరోవైపు అండమాన్, నికోబార్ క్రికెట్ సంఘాలకు బీసీసీఐ అసోసియేట్ మెంబర్‌షిప్ ఇచ్చేందుకు ఆమోద ముద్ర వేయనుంది. బీసీసీఐకి అనుబంధంగా మారితే అండమాన్, నికోబార్‌లో క్రికెట్ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

# కంకషన్ల దెబ్బకు రిటైర్మెంట్

- **నా కెరీర్ నాశనానికి ఆ పాఠశాలే కారణం**
- **స్కూల్‌పై కోర్టులో లా సూట్ ఫైల్ చేసిన విల్ పుకోవిస్కీ**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ విల్ పుకోవిస్కీ 27 ఏళ్ల వయసులోనే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. జాతీయ జట్టు తరఫున కేవలం ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 36 మ్యాచ్‌లు ఆడాడు. అయితే వరుసగా ఎదురైన కంకషన్ (తలకు బలమైన దెబ్బ కారణంగా మెదడుపై ప్రభావం) గాయాలతో అతడి క్రికెట్ కెరీర్ అర్ధంతరంగా ముగిసింది. తాజాగా తన కెరీర్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిన తొలి కంకషన్ ఘటనకు సంబంధించి పుకోవిస్కీ తాను చదువుకున్న పాఠశాలపై న్యాయపోరాటానికి దిగాడు. తన కెరీర్ ఇలా అవ్వడానికి కారణం స్కూలేనని ఆరోపిస్తూ తాజాగా దావా వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మెల్‌బోర్న్‌లోని బ్రైటన్ గ్రామర్ స్కూల్‌లో విల్ విద్యనభ్యసించాడు. 2014లో ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. అప్పుడు అతడి వయసు 16 ఏళ్లు. ఆ ఫుట్‌బాల్ సెషన్‌లో విల్ తలకు గాయమైంది. 'ఆ సమయంలో స్కూల్ యాజమాన్యం సరైన వైద్యం అందించలేదు. దెబ్బ తగిలిన కొద్ది నిమిషాలకే తిరిగి శిక్షణలోకి పంపిచారు. ఆ గాయం ప్రభావంతో నేను కొన్ని నెలల పాటు స్కూల్‌కు కూడా వెళ్లలేదు. అందుకే క్రికెట్ కెరీర్‌లో పలుమార్లు గాయాలబారిన పడాల్సి వచ్చింది' అని విల్ ఆరోపించాడు.

**కెరీర్‌లో 13 కంకషన్లు!**

ఆ తొలి గాయం తర్వాత విల్ కెరీర్‌లో కంకషన్లు వెంటాడాయి. క్రికెట్ ఆడుతున్న సమయంలో అతడికి 13 కంకషన్లు నమోదయ్యాయి.

Published by Cheviti Ashok on behalf of Printing Ratna Graphics, Editor : Sampath Ganga. RNI No - TGTEL/26/A3750.